సమావేశము - II
వాల్యూము - IV
సెం. 1

వెల : రూ. 4-50
23 సెప్టెంబర్, 2015
బుధవారము,
(శక సం. 1937,
భాద్రపద - 10)

# తెలంగాణ శాసన సభ కార్యకలాపాలు

## అధికార నివేదిక

### విషయ సూచిక

1. సంతాప ప్రతిపాదనలు : ... 01

1. మాజీ రాష్ట్రపతి స్వర్గీయ డా. ఎ.పి.జె. అబ్దుల్ కలాంగారి మృతి గురించి

2. తెలంగాణ మొదటి శాసన సభ్యులు స్వర్గీయ పట్లోళ్ల కిష్టారెడ్డి గారి మృతి గురించి

# తెలంగాణ శాసన సభ

## ప్రధాన అధికారులు

| | | |
|---|---|---|
| సభాపతి | : | శ్రీ  ఎస్. మధుసూధనాచారి |
| ఉప సభాపతి | : | శ్రీమతి పద్మా దేవేందర్ రెడ్డి |
| కార్యదర్శి | : | డా. ఎస్.  రాజ సదారామ్ |
| ఉప కార్యదర్శులు | : | డా. వి. నరసింహాచార్యులు |
| సహాయ కార్యదర్శులు | : | శ్రీ టి. బి. జయచందర్<br>శ్రీ ఎస్. దుర్గాప్రసాద్<br>శ్రీ సి.హెచ్. ఉపేందర్ రెడ్డి<br>శ్రీమతి  వి.ఎస్. ప్రసన్నకుమారి |
| చీఫ్ రిపోర్టర్ | : | శ్రీ పి. శ్రీనివాస్ |

# తెలంగాణ శాసన సభ కార్యకలాపాలు

## అధికార నివేదిక

## [మూడవ సమాగమపు రెండవ విడత సమావేశము - మొదటి రోజు]

బుధవారము, సెప్టెంబరు 23, 2015

[సభ ఉ.గం. 10.00 లకు ప్రారంభమైనది]

[గౌరవ సభాపతి అధ్యక్ష స్థానములో ఉన్నారు]

...

[సమావేశం జాతీయ గీతాలాపనతో ప్రారంభమైంది]

### సంతాప ప్రతిపాదనలు

**1. మాజీ రాష్ట్రపతి స్వర్గీయ డా.ఎ.పి.జె. అబ్దుల్ కలాం గారి మృతి గురించి**

మిస్టర్ స్పీకర్: మాజీ రాష్ట్రపతి స్వర్గీయ డా. ఎ.పి.జె. అబ్దుల్ కలాం గారి మృతి పట్ల సంతాప తీర్మానము.

శ్రీ కె. చంద్ర శేఖర రావు (ముఖ్యమంత్రి): అధ్యక్షా, భారత దేశ మాజీ రాష్ట్రపతి, డా. ఎ.పి.జె. అబ్దుల్ కలాం గారి మృతి పట్ల ఈ సభ తీవ్ర సంతాపాన్ని వ్యక్తం చేస్తూ, శోకార్తులైన వారి కుటుంబ సభ్యులకు ప్రగాడ సానుభూతిని తెలియజేస్తున్నాను. ఆయన1931వ సంవత్సరం అక్టోబర్ 15వ తేదీ నాడు తమిళనాడు రాష్ట్రం రామేశ్వరంలో ఒక నిరుపేద కుటుంబంలో జైనలాబుద్దీన్ ఆశయమ్మ దంపతులకు జన్మించారు. ఉన్నత చదువులు చదివి శాస్త్రవేత్తగా, అధ్యాపకులుగా మరియు రాష్ట్రపతిగా భారత దేశానికి ఎనలేని సేవలను అందించారు. ఆయన జీవిత కాలమంతా అంతరిక్షపరిశోధనలతోను, శాస్త్ర, సాంకేతిక రంగాల్లో మన దేశ ప్రగతిని ఉన్నత శిఖరాలకు చేర్చడానికి కృషిచేశారు. 1998 సంవత్సరంలో పోక్రాన్ అణు పరీక్షల వెనుక కీలక శక్తి అయిన అబ్దుల్ కలాం గారు, వాజ్‌పేయి గారు ప్రధాన మంత్రిగా ఉన్న సమయంలో ఆయన ప్రధాన శాస్త్ర సాంకేతిక రంగ సలహాదారుగా వ్యవహరించారు. హైదరాబాద్ నగరంతో వారికి విడదీయలేని అనుబంధం ఉంది. వీరు నగరంలోని కంచన్‌బాగ్‌లో నివాసం ఉంటూ అంతరిక్ష పరిశోధన మరియు అభివృద్ధి సంస్థలో అనేక సంవత్సరాల పాటు విధులు నిర్వహించారు. జూలై, 2002వ సంవత్సరం నుండి జూలై, 2007వ సంవత్సరం వరకు భారత 11వ రాష్ట్రపతిగా మన దేశానికి నిస్వార్థ సేవలందించారు. సుకోయ్ యుద్ధ విమానాన్ని నడిపించి, జలాంతర్గామిలో ప్రయాణించి, సుయాచిన్‌ని సందర్శించిన తొలి రాష్ట్రపతిగా ప్రఖ్యాతి గాంచారు. ఆయన సేవలను గుర్తించి భారత ప్రభుత్వం 1981వ సంవత్సరంలో "పద్మభూషణ్", 1990వ సంవత్సరంలో పద్మ "విభూషణ్", 1997వ సంవత్సరంలో అత్యుత్తమ పౌరపురస్కారమైన "భారతరత్న" బిరుదుతో ప్రభుత్వం సత్కరించింది. జాతి, కుల, మత బేధాలను విస్మరించి, మన దేశానికి విశేష సేవలందించిన భరతమాత ముద్దు బిడ్డ స్వర్గీయ అబ్దుల్ కలామ్ గారు. ఆయన Wings of Fire, Vision -2020 వంటి పుస్తకాలను రచించారు. ఆయన మరణం మన దేశానికి, ముఖ్యంగా రక్షణ రంగానికి తీరని లోటు. దేశ యువతను ఎల్లప్పుడూ కలిసి మాట్లాడుతూ, వారిలో విజ్ఞాన తృష్ణను కలిగించడానికి ఎంతో శ్రమించే ఆయన చివరి శ్వాస వరకు అదే విధిలో నిమగ్నమై ఎనభై మూడేళ్ల వయసులో జూలై, 27వ తేదీన షిల్లాంగ్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్‌లో Liviable Planet Earth అనే అంశంపై విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగిస్తూ తీవ్ర గుండె పోటుతో అకాల మృతి చెందారు. వారికి వారి యొక్క మృతి పట్ల తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ మరియు ప్రజల పక్షాన సానుభూతిని తెలియజేస్తూ, హైదరాబాద్‌లోని "డి.ఆర్.డి.ఎల్." సంస్థకు ఆయన మరణం జరిగిన సందర్భంలోనే వారి పేరును పెట్టాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరడం జరిగింది. ఆ విషయం మరొకసారి భారత ప్రభుత్వానికి గుర్తు చేస్తూ, వారి ఆత్మకు ప్రగాడ సానుభూతిని, వారి కుటుంబ సభ్యులకు సానుభూతిని ప్రకటిస్తూ సెలవు తీసుకుంటున్నాను.

శ్రీ కె. జానా రెడ్డి (నాగార్జున సాగర్): అధ్యక్షా, డా. ఎ.పి.జె. అబ్దుల్ కలాం గారి మృతి పట్ల ముఖ్యమంత్రి గారు ప్రవేశ పెట్టిన

తీర్మానాన్ని బలపరుస్తూ, ఏకీభవిస్తూ కలాం గారి గురించి మాటలతో తెలియజేయనవసరం లేదు. ఆయన గొప్ప శాస్త్రజ్ఞుడు. దేశాభివృద్ధి, భద్రత విషయాల పట్ల ఆయన ప్రధానమైన వ్యక్తిగా ఎదగడం గర్వించదగ్గ విషయం. శాస్త్ర విజ్ఞానంతోబాటు, మానవతా మనిషిగా జాతి యొక్క భద్రత మరియు భవిష్యత్తు గురించి అహర్నిశలూ ఆలోచించినటువంటి మహనీయుడు. అందుకు అనుగుణంగానే భారత ప్రజలు ఆయనను గౌరవించారు. ఆయనను అనేక గౌరవాలతో ప్రభుత్వం సత్కరించినటువంటి విషయం మనందరికి తెలుసు. ఈ సందర్భంగా ఆయనను గుర్తు చేసుకుంటూ ఆయన ఆలోచనా విధానాన్ని, ఆయన స్ఫూర్తిని భారత ప్రజలు పొందాలని, జాతి మొత్తం కుల, మత రహిత ప్రజాస్వామ్య పద్ధతుల్లో ఐకమత్య భావనతో ముందుకు పోవాలని కోరుకుంటూ, ముఖ్య మంత్రిగారు ప్రతిపాదించినట్లుగా "డిఆర్‌డిఎల్" సంస్థకు ఆయన పేరు పెట్టడం సమంజసం. కాబట్టి ఆ తీర్మానాన్ని పునరుద్ఘాటిస్తూ కేంద్ర ప్రభుత్వానికి విన్నవిస్తున్నాను. చివరిగా ఆయన మృతి పట్ల ప్రగాఢ సంతాపాన్ని తెలియజేస్తూ, వారి కుటుంబ సభ్యులకు సానుభూతి వ్యక్తం చేస్తున్నాను.

శ్రీ ఇ. దయాకర్ రావు (పాలకుర్తి): అధ్యక్షా, డా. ఎ.పి.జె. అబ్దుల్ కలాం గారి మృతి పట్ల ముఖ్యమంత్రి గారు ప్రవేశ పెట్టిన తీర్మానాన్ని బల పరుస్తా, ఆయన మహా ఋషి, దేశానికే పేర్న తెచ్చారు. ఆయన చనిపోయిన రోజు దేశమంతటికీ తన కుటుంబ సభ్యుడు చనిపోయిన భావన కలిగింది.

10.10 ఉ. అబ్దుల్ కలాం గారిని స్ఫూర్తిగా తీసుకుని రాష్ట్రాన్ని ముందుకు నడిపించాలని కోరుకుంటున్నాను. అప్పటి ప్రధానమంత్రి శ్రీ అటల్ బిహారీ వాజ్‌పాయ్ గారు రాష్ట్రపతి కోసం ముగ్గురి పేర్లను ప్రపోజ్ చేయగా చంద్రబాబునాయుడు గారు అబ్దుల్ కలాం గారి పేరును సూచించినందున, ఆనాడు అబ్దుల్ కలాం గారు నియమితులయ్యారు. ముఖ్యమంత్రి గారు డి.ఆర్.డి.ఎల్. సంస్థకు కలాం గారి పేరు పెట్టాలని సూచించడం గర్వించదగ్గవిషయం. ఆయన డి.ఆర్.డి.ఎల్ సంస్థలో డైరెక్టర్‌గా పది సంవత్సరాలు సేవలు అందించారు. ఈ విషయమై ముఖ్యమంత్రి గారితో ఏకీభవిస్తున్నాను. కలాం గారి స్ఫూర్తితో రాష్ట్రంలో మరెన్నో కార్యక్రమాలు చేపట్టాలని ముఖ్యమంత్రి గారికి సూచిస్తూ, ఇటువంటి వ్యక్తి మన ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో పుడితే బాగుంటుందని కోరుకుంటూ.

(అంతరాయం)

(ఈ సందర్భంలో అధికార పక్ష సభ్యులు నవ్వుతూ..... ఇంకా అక్కడే ఉన్నావా అని..... తెలంగాణలోనే వారు పుట్టాలని అన్నారు.)

శ్రీ ఇ. దయాకర్ రావు: పాత ఆంధ్రప్రదేశ్ అంటే రెండు రాష్ట్రాలు కలుస్తాయని..... (నవ్వుతూ) సరే సారీ, సారీ...... ఆయన మరల తెలంగాణ రాష్ట్రంలోనే పుట్టాలి. తెలుగు ప్రజలల్లోనే పుట్టాలి.

డా. కె. లక్ష్మణ్ (ముషీరాబాద్) : అధ్యక్షా, ముఖ్య మంత్రి గారు ప్రవేశ పెట్టిన సంతాప తీర్మానాన్ని బల పరుస్తున్నాను. భారత మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం గారు గొప్ప మానవతా వాది, దేశమంతా గర్వించదగిన వారు. వారి మరణవార్త విని దిగ్భ్రాంతి చెందాము. ముఖ్యంగా అందరికీ స్ఫూర్తినిచ్చే విధంగా రాష్ట్రపతిగా బాధ్యతలు నిర్వహించిన వ్యక్తి. రాష్ట్రపతి బాధ్యతల అనంతరం కూడా అనేక విశ్వవిద్యాలయాల్లో అనేక విషయాల ద్వారా యువతకు దిశానిర్దేశము చేశారు. షిల్లాంగ్‌లోని, ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మ్యానేజ్‌మెంట్ కళాశాలలో ప్రసంగిస్తున్న సమయంలో వారికి గుండెపోటు రావడం బాధాకరమైన విషయం. ఆయన తమిళనాడు రాష్ట్రం రామేశ్వరంలో పుట్టారు. ఆయన కుటుంబం చాలా ఒడిదుడుకులను ఎదుర్కొంది. ఆయన జీవిత ప్రస్థానం ఒక న్యూస్ పేపర్ బాయ్‌గా ప్రారంభమై అంచెలంచెలుగా ఎదిగి, ఒక గొప్ప అణ్వస్త్ర శాస్త్రవేత్తగానే కాకుండా, Man of Missiles of India గా, అంతరిక్ష పరిశోధనలో ఆయనకు ప్రత్యేక గుర్తింపు రావడం జరిగింది. అబ్దుల్ కలాం గారికి తెలంగాణ రాష్ట్రానికి అనుబంధమున్న విషయం మీకు తెలుసు. వాజ్‌పాయ్ గారు ప్రధాన మంత్రిగా ఉన్నప్పుడు అబ్దుల్ కలాం గారు ప్రత్యేక సలహాదారుగా కొనసాగుతూ, దేశం మొత్తం గర్వించదగ్గ వ్యక్తిగా రూపాంతరం చెందడం జరిగింది. 1981లో పద్మ భూషణ్, 1990లో పద్మ విభూషణ్, 1997లో భారతరత్న వంటి అవార్డులు పొందడం దేశానికే గర్వ కారణం. దేశ, విదేశాల్లో కూడా దాదాపు 40 విశ్వవిద్యాలయాల్లో Honorary Doctorate పట్టా పొందిన వ్యక్తి. వాజ్‌పాయ్ గారు అబ్దుల్ కలాం గారిని 11వ రాష్ట్రపతిగా కొనసాగితే బాగుంటుందని ఎన్నికలు నిర్వహించినప్పుడు నేను కూడా సభ్యునిగా ఓటు వేసే అవకాశం వచ్చినందుకు నేనెంతో గర్వపడుతున్నాను. ఆయన జీవన ప్రస్థానమంత యువతకు స్ఫూర్తి కావాలి. కలలు కనండి, కన్న కలలు సాకారం చేయడానికి కృషిచేయమని ఆయన యువతకు ప్రత్యేకంగా పదే పదే చెప్పేవారు. ఆయన జీవితం అందరికీ స్ఫూర్తిదాయకంగా ఉండాలని భావిస్తూ, భారతీయ జనతా పార్టీ తరఫు నుంచి వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేస్తున్నాను. వారి

కుటుంబసభ్యులుగా భావించే ప్రతి పౌరుడికి భగవంతుడు మనోస్థైర్యాన్ని ప్రసాదించాలని, ముఖ్యమంత్రి గారు ఆయన పేరును డి.ఆర్.డి.ఎల్.సంస్థకు నామకరణం చేయాలనే విషయాన్ని పూర్తిగా ఏకీభవిస్తున్నాను.



శ్రీ పాయం వెంకటేశ్వర్లు (పినపాక): అధ్యక్షా, గౌరవ ముఖ్య మంత్రి గారు ప్రవేశ పెట్టిన సంతాప తీర్మానాన్ని బల పరుస్తున్నాను. అబ్దుల్ కలాం గారు తమిళనాడులోని రామేశ్వరం అనే కుగ్రామంలో నిరుపేద కుటుంబంలో జన్మించి అంచెలంచెలుగా ఎదిగి భారత మొదటి పౌరుడిగా బాధ్యతలు కొనసాగించారు. దేశంలోనే అత్యున్నత స్థానానికి ఎదిగినటువంటి మానవతావాది, గొప్ప వ్యక్తి. అబ్దుల్ కలాం గారు దేశానికి వివిధ రంగాల్లో అందించిన అనేక సేవలు ఈ దేశానికి, ప్రపంచానికి తెలుసు. అబ్దుల్ కలాం గారి జీవితాన్ని నేటి యువతరం ఆదర్శంగా తీసుకుని ముందుకు వెళ్లాల్సిన అవసరం ఉంది. అవివాహితుడైన అబ్దుల్ కలాం గారు నిరాడంబర జీవితాన్ని గడుపుతూ, భారత మొదటిపౌరుడిగా, సైంటిస్ట్‌గా ఉన్నా ఎక్కడా కుడా ప్రొటోకాల్‌ను దృష్టిలో ఉంచుకోకుండా సామాన్య వ్యక్తిగా సామాన్యుల్లో కలిసిపోయేవారు. వారు లోకం వీడే నాటికి వారి దగ్గర ఉన్న ఆస్థి నాలుగు జతల బట్టలు, పుస్తకాలు. గౌరవ ముఖ్య మంత్రి గారు డి.ఆర్.డి.ఎల్.కు అబ్దుల్ కలాం గారి పేరును ప్రతిపాదించడాన్ని సంపూర్ణంగా బల పరుస్తూ, అదే విధంగా మెట్రో రైలు నిర్మాణాలకు కూడా అబ్దుల్ కలాం గారి పేరును పెట్టాలని కోరుతున్నాను.

10.20 ఉ. మన రాష్ట్రంలో నిర్మాణం జరుగుతున్న మెట్రో రైలుకు అబ్దుల్‌కలామ్‌గారి పేరు పెట్టాలని కోరుతున్నాను. వారి అకాల మరణం దేశానికి తీరని లోటని, వారి కుటుంబానికి ప్రగాడ సానుభూతిని తెలియచేస్తూ, వారి ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకుంటూ సెలవు తీసుకుంటున్నాను.

శ్రీ సున్నం రాజయ్య (భద్రాచలం): ముఖ్యమంత్రిగారు ప్రవేశ పెట్టిన మన మాజీ రాష్ట్రపతి డా. ఎ.పి.జె. అబ్దుల్ కలామ్‌గారి సంతాప తీర్మానాన్ని సంపూర్ణంగా బలపరుస్తున్నాను. వారు శాస్త్ర సాంకేతిక రంగాలలో మంచి శాస్త్రవేత్తగా అవిరళ కృషి చేశారు. వారు రాష్ట్రపతిగా ఉన్న కాలంలో, రాష్ట్రపతిగా పదవీ కాలం ముగిసిన తరువాత కూడా విద్యార్థులు అన్నా, యువత అన్నా ఎంతో ఉత్సాహంగా అనేక సాంకేతిక కార్యక్రమాలు ఎక్కడ ఏ రాష్ట్రంలో, ఏ ప్రాంతంలో ఉన్నా వారిని ప్రోత్సహించే వారు. వారు అటువంటి మహా వ్యక్తి. వారు మరణించిన వార్త తెలియగానే మన దేశ ప్రజలే కాక ప్రపంచంలోని ప్రజలందరూ శోకసంద్రంలో మునిగిన రోజును మనందరం చూశాము. తెలంగాణలోని అనేక ప్రాంతాలలో వారు అనేక సందర్భాలలో కళాశాలలో , ఇతర శాస్త్ర సాంకేతి రంగాల అంశాలకు సంబంధించి ప్రత్యక్షంగా పర్యటించి ప్రోత్సహించిన మేధావి. వారి మరణం దేశానికి తీరని లోటు. ముఖ్యమంత్రిగారు చొరవ తీసుకొని "డి.ఆర్.డి.ఓ.కి" సంబంధించి ఆయన పేరు పెట్టాలని సూచించడం జరిగింది. దానికి మా మద్దతు తెలియచేస్తున్నాను. అది చాలా హర్షణీయం . మా పార్టీ తరపున ప్రగాఢ సానుభూతిని తెలియ చేస్తూ, వారి ఆత్మకు శాంతి కలగాలని తెలియచేస్తున్నాను.

శ్రీ ఆర్. రవీంద్ర కుమార్ (దేవరకొండ): గౌరవ ముఖ్యమంత్రిగారు ప్రవేశపెట్టిన సంతాప తీర్మానాన్ని మా పార్టీ తరపున పూర్తి స్థాయిలో బలపరుస్తున్నాను. ఎ.పి.జె. అబ్దుల్ కలామ్‌గారు హైదరాబాదు నగరంలో డిఆర్‌డిఎల్‌లో డైరెక్టరుగా పని చేశారు. వారికి హైదరాబాదుతో ఉన్న అనుబంధం మరువరానిది. భారతదేశం అభివృద్ధి చెందాలంటే , మానవ వనరులు అభివృద్ధి చెందాలన్న అంశాన్ని యువతకు, విద్యార్థులకు తెలియచేశారు. యువతకు ఒక మార్గ నిర్దేశకాన్ని అందించారు. ఆయన మంచి రాష్ట్రపతిగా పని చేశారు. వారికి హైదరాబాదుతో మంచి అనుబంధం ఉంది. మానవతా విలువలు కలిగిన మాజీ రాష్ట్రపతి మరణ వార్త విన్న తరువాత భారతదేశంతోపాటు ప్రపంచ దేశాలన్నీ దిగ్భ్రాంతికి గురి అయ్యాయి. ముఖ్యమంత్రిగారు చెప్పిన విధంగా డిఆర్‌డిఎల్‌కు వారి పేరు పెట్టడం చాలా భావ్యమైనదే. ఇంకేమైనా అవకాశం ఉంటే మన తెలంగాణ రాష్ట్రంలో అనేక కొత్త యూనివర్సిటీలు పెట్టడానికి ముఖ్యమంత్రిగారు చొరవ చూపిస్తున్నారు. అవకాశముంటే ఏదో ఒక యూనివర్సిటీకి వారి పేరు పెడితే బాగుంటుందని, హుందాగా ఉంటుందని తెలియ చేస్తున్నాను. ముఖ్యమంత్రిగారు ప్రవేశపెట్టిన తీర్మానాన్ని బలపరుస్తున్నాను.

శ్రీ ఈటల రాజేందర్ (ఆర్థిక శాఖ మంత్రి ): అధ్యక్షా, ఎ.పి.జె. అబ్దుల్ కలామ్‌గారు పరమపదించడం మన లాంటి ఎదుగుతున్న రాష్ట్రానికి, దేశానికి తీరని లోటని భావిస్తున్నాను. 2004వ సంవత్సరంలో తెలంగాణ ఉద్యమంలో భాగంగా మేము శాసనసభకు

ఎన్నికై వచ్చిన తరువాత ఉభయసభలను ఉద్దేశించి ఎ.పి.జె. అబ్దుల్ కలామ్‌గారు ప్రసంగించారు. అప్పుడు మీకు ఏమైనా సందేహాలుంటే నివృత్తి చేసుకోమన్నారు. అప్పుడు నేను నాలుగైదు ప్రశ్నలు చిట్టీ మీద వ్రాసి వారికి పంపడం జరిగింది. ప్రెసిడెంట్‌గారూ, ఈ దేశాన్ని పట్టి పీడిస్తున్న కుల తత్వం, మత తత్వం, ఆశ్రిత పక్షపాతం, లంచగొండితనం , పేదరికం అసమానతలు పోవడానికి మీరు రాష్ట్రపతిగా సూచన చేయాలని చిట్టీ పంపడం జరిగింది. వారు ఉపన్యాసం ఇస్తారని ఆశించాను. ఈ రుగ్మతలన్నీ పరిష్కారం కావడానికి ఇద్దరు వ్యక్తులు బాధ్యత వహించవలసి ఉంటుందని, An elimentary teacher and a parent can eradicate all these things అని ఒక్క వాక్యంలో వారు సమాధానం చెప్పారు. అటువంటి గొప్ప మేధావి ఆయన.

దేశానికి విద్య, విజ్ఞానం మాత్రమే పరిష్కారమని ఆయన సూచించారు. వారు బ్రతికి ఉన్నన్ని రోజులు ఎక్కడైనా విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడేవారు. 69 సంవత్సరాల స్వతంత్ర భారతదేశంలో అనేక సందర్భాలలో అనేక మంది రాజకీయ నేతలు ఈనాటి విద్యార్థులే రేపటి భావి భారత పౌరులని చెప్పి ఉపన్యాసాలు ఇచ్చాము. వారు బ్రతికి ఉన్నన్నాళ్లు దేశం బాగుపడాలంటే ఈనాటి విద్యార్థుల పైనే ఆధారపడి ఉందనేవారు. ఆ విధంగా విద్యార్థులకు దిశా నిర్దేశం చేసిన గొప్ప మహనీయుడు అబ్దుల్ కలామ్‌గారు. వారు కేవలం సైంటిస్టే కాక ఒక సామాజిక శాస్త్రవేత్త కూడా . ఆయన ఒక మంచి రచయితగా , ఉపన్యాసకుడిగా పేరు తెచ్చుకున్నారు. తాను దేశ వ్యాప్తంగా, ప్రపంచ వ్యాప్తంగా పేరున్న గొప్ప గొప్ప విశ్వవిద్యాలయాలకు ఆనరరీ ప్రొఫెసర్‌గా ఉన్న సందర్భాన్ని గుర్తించాలి. చివరికి ఆయనకు ఇష్టమైన వృత్తి పాఠం చెప్పే వృత్తి కాబట్టి అందులో షిల్లాంగ్‌లో ఐఐఎమ్ విద్యార్థులతో ప్రసంగిస్తూ చని పోవడం ఎంతో అదృష్టం ఆ విధంగా వారి జీవితం ఎంతో ధన్యమైనది. వారు ఒక సందర్భంలో మిసైల్ సైన్స్‌లో ఈ దేశం ఎంత గొప్పగా రాణించినప్పటికీ అనేక విషయాలలో ఆవిష్కరణలు చేసినప్పటికి నాకు తృప్తిగా లేదు. శాస్త్ర సాంకేతిక విద్యా ఫలాలు అశేష ప్రజానీకానికి అందించవలసిన అవసరముందన్నారు. ఈ దేశంలో కాళ్లు లేని వారికి చాలా బరువుతో ఉన్న ఇనుప రాడ్‌తో కాలిపర్స్ తయారు చేస్తున్నారు. కాబట్టి విమానాలలో వినియోగించే లైట్ మెటల్‌ను ఉపయోగించి దేశంలోని వారికి లైట్ కాలిపర్స్ ను అందించిన గొప్ప మహనీయుడు ఆయన. ఈ దేశంలో అనేక మంది రోగాల భారిన పడుతున్న సందర్భంలో అలాంటి పేదలకు వైద్యం అందించడంలో లక్షల రూపాయలు ఖర్చు అవుతోంది. అందుకని శాస్త్ర విజ్ఞానం ఆ దిశగా కూడా ప్రయాణం చేయాలని వారు అనేకసార్లు చెప్పారు. ఒక్క మాటలో చెప్పాలంటే ఈ రోజు జియో యుగం, రాకెట్ యుగమని చెబుతున్నాము. కాని అటువంటి యుగాలలో ఆకలి చావులు ఉన్నాయి వాటికి పరిష్కారం కనుగొనాలి, మనుషులందరికీ బ్రతికే హక్కుగా శాశ్వత ప్రయత్నం చేయాలని అనేకసార్లు ఉపన్యాసాలు ఇచ్చేవారు. నిజంగా అబ్దుల్ కలామ్‌గారు ఒక వ్యక్తి అయినప్పటికి కొన్ని లక్షలాది మంది, కోట్ల మంది విద్యార్థులు ఆయన చనిపోయిన రోజున కన్నీరు కార్చిన తీరు చూస్తే అబ్దుల్ కలామ్‌గారు చిన్నారుల గుండెల్లో ఎంత గొప్పగా గూడు కట్టుకున్నారో అర్థం చేసుకోవచ్చు. వారి ఆశయాన్ని చివరి వరకు కొనసాగించాలి. తెలంగాణలాంటి కొత్త రాష్ట్రంలో గౌరవ ముఖ్యమంత్రిగారు కెజి టు పిజి విద్యను అందిస్తే సగం సమస్యలు పరిష్కారమవుతాయని కెసిఆర్‌గారు అన్నారు. అబ్దుల్ కలామ్‌గారు కన్న కలలు నెరవేరే అవకాశం ఉంటుంది. విద్యను అన్ని వర్గాల ప్రజలకు అందించడంలో తెలంగాణ ప్రభుత్వం కృషి చేస్తుందని మేము నిర్ణయం తీసుకున్నాము. ఖచ్చితంగా ఆయనకు నివాళులు అర్పిస్తూ వారి కుటుంబానికి ప్రగాఢ సానుబూతిని తెలియ చేస్తూ, వారి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తున్నాను.

**10.30 ఉ.** | శ్రీ వి. శ్రీనివాస్ గౌడ్ (మహబూబ్‌నగర్) : అధ్యక్షా, అబ్దుల్ కలాం గారు భౌతికంగా లేకపోవడం హైదరాబాద్‌కే కాదు, భారతదేశానికే తీరని లోటు. భారతదేశమే కాదు, ప్రపంచ జాతి గర్వించదగ్గ బిడ్డ అబ్దుల్ కలాం. ఒక చిన్న కుటుంబంలో జన్మించి, అంచెలంచెలుగా ఎదిగి, రాష్ట్రపతి అయ్యారు. రాష్ట్రపతిగా ఉన్నప్పుడు కూడా సామాన్య జీవితాన్ని అనుభవించారు. ఆయనకు వచ్చినటువంటి జీతభత్యాలను పేద విద్యార్థులకు, పేద జాతికి అంకితం చేశారు. ఆయన పదవీకాలం ముగిసిన తరువాత ప్రొఫెసర్‌గా పనిచేస్తూ, ఆ వచ్చిన డబ్బును పేద జాతికి అంకితం చేసినటువంటి ఒక గొప్ప మహా వ్యక్తి అబ్దుల్ కలాం. ఆయన ఒక శాస్త్రవేత్తే కాదు, రచయిత కూడా. వారికి సంగీతం అంటే మక్కువ ఎక్కువ. పేద వారంటే ఆయనకు మరీ ఎక్కువ ఇష్టం. పేద జాతి నిర్మూలన గురించి, గ్రామీణ ప్రాంతాలలో ఉన్నటువంటి నిరుపేదల గురించి, ప్రభుత్వాలకు సలహాలు, సూచనలు ఇచ్చినటువంటి మహోన్నత వ్యక్తి ఆయన. అబ్దుల్ కలాం గారు ఒక గొప్ప మానవతావాది. అందరికీ ఒక్క తల్లి ఉంటే నాకు ముగ్గురు తల్లులున్నారని చెప్పిన వ్యక్తి ఆయన. జన్మనిచ్చిన తల్లి ఒకరైతే, మరొకరు ఎం.ఎస్. సుబ్బలక్ష్మి గారు, మూడవ తల్లి మానవతావాది మధర్ థెరిస్సా అని చెప్పినటువంటి మహోన్నత వ్యక్తి. ఆయన రాష్ట్రపతిగా ఉన్నప్పుడు, రాష్ట్రపతి అంటే రబ్బర్ స్టాంప్ కాదు, ఖచ్చితంగా తప్పు ఉన్నప్పుడు దాన్ని సరిదిద్దాలని, ఒక ప్రముఖ బిల్లును

తిరస్కరించి, రాజకీయ పార్టీలను ఆకర్షించిన గొప్ప మహోన్నత వ్యక్తి అబ్దుల్ కలాం గారు. అలాంటి గొప్ప వ్యక్తికి హైదరాబాద్‌తో మంచి సంబంధం ఉంది. హైదరాబాద్‌లో ఉన్న డీఆర్‌డీఓ కార్యాలయంలో డైరెక్టర్‌గా పనిచేసినప్పుడు ప్రపంచ దేశాలను ఆకర్షించారు. క్షిపణులు తయారుచేయడంలో ప్రముఖ పాత్రను పోషిస్తున్న అబ్దుల్ కలాం గారు హైదరాబాదులో ఉన్నారని అందరికీ తెలిసే విధంగా, అందరినీ ఆకర్షించినటువంటి గొప్ప వ్యక్తి ఆయన. హైదరాబాద్‌లో దాదాపు వంద స్కూల్స్‌ను సందర్శించి ప్రతి వారం, సెంట్రల్ యూనివర్శిటీకి వెళ్లి అక్కడ క్లాసులు చెప్పేవారు. హైదరాబాదులో ఉన్నటువంటి ప్రకృతి, రాక్ గార్డెన్స్ నాకు ఇష్టమని అనేక సందర్భాలలో చెప్పారు. నాకు జన్మనిచ్చిన రామేశ్వరం, ఆ తరువాత హైదరాబాద్ అంటే ఎంతో ఇష్టమని దేశ నలుమూలలకు చెప్పిన వ్యక్తి ఈరోజు మనకు లేకపోవడం బాధాకరం. 20-25 సంవత్సరాల క్రితం హైదరాబాదులో హార్ట్ పేషెంట్‌కి స్టంట్ వెయ్యాలంటే లక్షా, రెండు లక్షల రూపాయల ఖర్చు అయ్యేది. ఆ రోజులలో, పేద వాళ్లకు డబ్బు లేక, హార్ట్ ఎటాక్ వచ్చినప్పుడు చికిత్స చేయించుకోలేక చనిపోయిన సందర్భాలు చాలా ఉన్నాయి. అప్పుడు ఆయన స్వయంగా నిమ్స్ ఆసుపత్రికి వెళ్లి, అక్కడున్నటువంటి వైద్యులతో, శాస్త్రవేత్తలతో మాట్లాడి పది వేల రూపాయలకు స్టంట్ వేసే విధంగా చర్య తీసుకున్నారు. దేశంలోనే అతి తక్కువ ఖర్చుతో స్టంట్ వేసే విధానాన్ని ఆచరణలోకి తెచ్చిన మంచి వ్యక్తి మన మధ్య భౌతికంగా లేకపోయినప్పటికీ, సూర్యచంద్రులు ఉన్నంతవరకూ ఆయన్ని మనం గుర్తుంచుకోవలసిన అవసరం ఉందని తెలియజేస్తూ మా ముఖ్యమంత్రి గారు ప్రవేశపెట్టిన తీర్మానాన్ని ఖచ్చితంగా ప్రతి ఒక్కరూ ఆమోదించవలసిందిగా మనసారా కోరుకుంటూ ముగిస్తున్నాను.

శ్రీ మల్లు భట్టి విక్రమార్క (మధిర): అధ్యక్షా, డా.ఏ.పి.జె. అబ్దుల్ కలాం గారు మరణించడం, భారతదేశానికి తీరని లోటుగా నేను భావిస్తున్నాను. ఆయన ఒక గొప్ప మానవతావాది. భారత దేశం, సాంకేతికంగా ప్రపంచ దేశాలతో పోటీ పడాలని, పెద్ద ఎత్తున భారతదేశం తలెత్తుకునే విధంగా ఉండాలని కలలు కని, తదనుగుణంగా ఆయన చేసినటువంటి పరీక్షలు, ఆయన ఈ దేశానికి అందించిన సైంటిఫిక్ రీసర్చ్ పెద్దఎత్తున ఉపయోగపడ్డాయనే విషయాన్ని ఈ సందర్భంగా మనం గుర్తు చేసుకోవలసిన అవసరం ఉంది. డీఆర్‌డీఓలో 1958లో ఆయన ప్రారంభించిన ప్రస్థానం, భారతదేశంలో అత్యున్నతమైనటువంటి స్థానమైన రాష్ట్రపతి స్థానం వరకూ ఎదగడానికి అనేక దశల్లో ఈ దేశం కోసం చేసిన సేవలు ఉపయోగపడ్డాయి. సామాన్య కుటుంబంలో పుట్టిన వ్యక్తికైనా సరే, లక్ష్యం ఉండి, కలలు కంటే ఏదైనా సాధించ గలడని చెప్పడానికి ప్రధానమైన ఉదాహరణ అబ్దుల్‌కలాం. చదువుకోడానికి కావలసిన కనీస సౌకర్యాలు లేకపోయినా, ఎదగడానికి కావలసిన ఆర్థిక పరిస్థితులు సహకరించకపోయినప్పటికీ, స్వశక్తితో సాధించాలనే పట్టుదలతో అద్భుతమైన విజయాలను సాధించినటువంటి ముద్దుబిడ్డ ఈ అబ్దుల్‌కలాం. ఈ దేశానికి మేలు చేయాలని ఆలోచించే ప్రతి యువకుడికి ఆయన జీవితం ఆదర్శవంతంగా ఉంటుందని నేను భావిస్తున్నాను. ముఖ్యమంత్రి గారు ప్రవేశపెట్టిన ఈ తీర్మానాన్ని సమర్ధిస్తున్నాను. ఆయన మొట్టమొదటిసారిగా సీనియర్ సైంటిఫిక్ అసిస్టెంట్‌గా జాయిన్ అయినటువంటి డీఆర్‌డీఓ సంస్థకి వారి పేరును పెట్టడానికి కాంగ్రెస్ పార్టీ సమర్ధిస్తుందని తెలియజేస్తున్నాను. హైదరాబాదుకి, వారి జీవితానికి విడదీయరాని సంబంధం ఉంది. పెద్దలు ఆర్థిక శాఖామాత్యులు చెప్పినట్లు పేద వాళ్లకు, ఫిజికల్లీ హ్యాండీక్యాప్డ్ వారికి పనికి వచ్చేటువంటి లెగ్స్‌ని తయారు చేయడమే కాకుండా, గుండెపోటుతో ఇబ్బంది పడే వారికి అత్యంత ఖరీదైన స్టంట్లను అతి తక్కువ ధరకు అందుబాటులోకి తీసుకురావాలనే ఉద్దేశ్యంతో హైదరాబాదులో ఉన్నటువంటి డాక్టర్లను కలిసి, రీసర్చ్, స్టడీ చేసి తక్కువ ధరకి స్టంట్‌లను అందించిన ఒక గొప్ప మేధావి అబ్దుల్ కలాం. "కలాం స్టంట్" అని ఇప్పటికీ చాలా మంది అంటుంటారు. పేద వాళ్ల గుండె ఆపరేషన్‌లకు పెద్దఎత్తున ఉపయోగపడే స్టంట్‌లను అందించిన గొప్ప వ్యక్తి ఆయన. చివరికి వారు, ఈ గుండె నొప్పితోనే, విద్యార్థులతో ప్రసంగిస్తున్నప్పుడు మరణించడం యాధృచ్ఛికం. ఆయన చేసిన సేవలు భారతదేశానికి ఎంతో ఉపయోగపడ్డాయి. ఆయన ఎన్నో పురస్కారాలను అందుకున్నారు. అబ్దుల్ కలాం గారి మరణానికి చింతిస్తూ, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, డీఆర్‌డీఓకి వారి పేరును పెట్టవలసిందిగా నేను ప్రతిపాదిస్తూ ముగిస్తున్నాను.

**10.40 ఉ.** శ్రీ రసమయి బాలకిషన్ (మానుకొండూరు): అధ్యక్షా, భారత రత్న డా. ఏ.పి.జె. అబ్దుల్ కలాం గారు ఒక గొప్ప స్ఫూర్తి ప్రదాత, మరీ ముఖ్యంగా ఈ దేశానికి, దేశ రక్షణకు ఒక కవచంలా పనిచేసిన గొప్ప మహనీయుడు. ముఖ్యంగా జీవితంలో ఎదుగుదామనుకున్న పేదవాళ్లకు పేదరికం అడ్డు కాదని, కృషి, పట్టుదల ఉంటే ఏదైనా సాధించవచ్చనే గొప్ప స్ఫూర్తినిచ్చిన మహానేత డా.ఏ.పి.జె. అబ్దుల్ కలాం గారు . చాలా మంది మహనీయులు చాలా సందర్భాలలో యువతకు సందేశాలిచ్చేటప్పుడు యువకుల్లారా మీరు కలలు కనొద్దని చెబుతుంటారు కానీ అబ్దుల్ కలాం గారు మాత్రం యువకుల్లారా మీరు కలలు కనండి, ఆ కలలను సాకారం చేసుకోమని చెప్పిన మహనీయుడు. ఈ ఆధునిక యుగంలో కూడా వారు

జీవించిన అతి సాధారణమైన జీవనం చూసి ప్రపంచమే ఆశ్చర్యపోయింది. వారు మరణించిన తరువాత వారు వాడిన వస్తువులను పరిశీలించినప్పుడు వారి నిరాడంబరమైన జీవన విధానానికి, వారి గొప్పతనానికి మరొక్కసారి ఘనంగా సెల్యూట్ చేసిన సందర్భాన్ని కూడా మనం చూశాం. వారికి తెలంగాణ ప్రాంతమన్నా మరీ ముఖ్యంగా హైదరాబాదు నగరమన్నా ఎంతో ఇష్టపడే సందర్భాన్ని గురించి గౌరవ ముఖ్యమంత్రి గారు వారి మాటలలో చెప్పారు, అది వాస్తవమే. ఎందుకంటే దేశంలోనే ఒక విభిన్నమైన సంస్కృతి కలిగిన ప్రాంతం, విభిన్న మతాల కలయికతో జీవించే ఈ తెలంగాణ ప్రాంతంలో ఇక్కడి ప్రజలందరూ ఒక పూల బతుకమ్మ మాదిరిగా జీవించే సంస్కృతిని కలాం గారు ఎంతో ఇష్టపడేవారనే సంగతి మనం ఎప్పుడూ మరచిపోలేము.

అంతే కాకుండా విద్యార్థుల పట్ల వారికుండే అపారమైన ప్రేమ గురించి మనకందరికీ తెలుసు. చాచా నెహ్రూ గారు బాలలంటే ఇష్టపడేవారు. కానీ బాలలు అబ్దుల్ కలాం గారంటే ఇష్టపడటాన్ని మనందరం చూశాం. ఎవరైతే ప్రపంచంలో మనుషులను ప్రేమిస్తారో ఆ మనుషులు ఆ నేతను ప్రేమిస్తారనడానికి ఇదొక ఉదాహరణగా మనం అబ్దుల్ కలాం గురించి చెప్పుకోవచ్చు. ఆయన జీవితమంతా కూడా యువత పట్ల, యువత ఎదుగుదల పట్ల వారికున్న ప్రేమను చాటిచెప్పారు. చివరకు తన మరణానికి ముందు కూడా విద్యార్థులకు బోధిస్తూ మరణించిన ఏకైక వ్యక్తిగా అబ్దుల్ కలాం గారిని చెప్పుకోవచ్చు.

ఇటీవల ఎవరెస్ట్ శిఖరాన్ని అధిరోహించిన పూర్ణ, ఆనంద్‌లను మీకు ఎవరు స్ఫూర్తి అని అడిగితే ఒక పేద కుటుంబంలో జన్మించి భారత రత్న, భారత రాష్ట్రపతిగా ఎదిగిన అబ్దుల్ కలాం గారి జీవితమే వారికి స్ఫూర్తి అని చెప్పారు. అనేక మంది దళిత, గిరిజనులకు వారి పట్ల ఉన్న గౌరవం గురించి మనందరం తెలుసుకున్నాం. అటువంటి మహనీయుడు మన మధ్య లేకపోయినప్పటికీ వారు ప్రజల గుండెల్లో ఎప్పుడూ చిరంజీవిగానే ఉంటారు. ముఖ్యంగా డి.ఆర్.డి.ఓ.కి అబ్దుల్ కలాం గారి పేరు పెట్టాలని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి గారు ప్రతిపాదించినందుకు వారికి కృతజ్ఞతలు తెలియజేస్తూ సెలవు తీసుకుంటున్నాను.

శ్రీ జి. కిషన్ రెడ్డి (అంబర్‌పేట): అధ్యక్షా, ముఖ్యమంత్రి గారు ప్రవేశపెట్టిన తీర్మానాన్ని సమర్థిస్తూ ఇదే శాసనసభలో అదే వేదిక నుంచి అబ్దుల్ కలాం గారు ఇచ్చిన సందేశాన్ని విన్నటువంటి అదృష్టం ఆనాటి గౌరవ శాసనసభ్యులకు వారితోబాటు నాకు కూడా లభించింది. నాకు కూడా వారిని ప్రశ్నలు అడిగే భాగ్యం లభించింది. అబ్దుల్ కలాం గారు ఒక కారణ జన్ముడు. ప్రపంచమంతా అసూయపడే విధంగా మన దేశాన్ని ఒక గొప్ప శక్తివంతమైన దేశంగా నిర్మాణం చేయాలని తపనపడిన వ్యక్తి, గొప్ప శాస్త్రవేత్త, గొప్ప మానవతావాది. తరగతి గదుల్లోనే దేశ భవిష్యత్ ఉన్నదని విశ్వసించిన మహానుభావుడు స్వామి వివేకానంద. యువతపట్ల అచంచలమైన విశ్వాసం స్వామి వివేకానంద గారికి ఉండేది. స్వామి వివేకానంద తరువాత యువతను అధికంగా ప్రేమించిన మహనీయుడు డా.ఏ.పి.జె. అబ్దుల్ కలాం గారు, వీరు చాలా ముందుచూపు ఉన్న వ్యక్తి. మన దేశం శక్తివంతంగా ఉండాలి, గతంలో మన దేశం మీద చైనా, పాకిస్తాన్‌లు చేసిన అనేక యుద్ధాలను దృష్టిలో పెట్టుకొని, ఆ దేశాలు అణుశక్తి దేశాలుగా ఉన్నాయనేది దృష్టిలో పెట్టుకొని మన దేశం కూడా అణుశక్తి దేశంగా అణు ఆయుధాలతో ఉండాలని భారతదేశంలో అందరికంటే ముందు ఆలోచన చేసిన గొప్ప మహానుభావుడు. ఈ దేశ రక్షణకు సంబంధించి ఆలోచన చేసిన వ్యక్తులలో అగ్రస్థానంలో ఉన్న వ్యక్తి డా. ఏ.పి.జె. అబ్దుల్ కలాం గారు. ఇతర దేశాల వారు చేసిన పరిశోధనలు మన దేశంలో కూడా చేయాలనే తపనతో అనేకసార్లు అనేక మంది ప్రధానమంత్రులకు చెప్పినప్పటికీ వారి మాట ఎవరూ వినలేదు. చివరకు ఆయనను తన సలహాదారుగా పెట్టుకున్న ప్రధాన మంత్రి అటల్ బిహారీ వాజ్‌పేయ్ గారు అణు పరీక్షలు నిర్వహించాలనే దానికి సంబంధించి మరొక వ్యక్తికి గానీ మరో దేశానికి గానీ తెలియకుండా ఇద్దరు కలిసి రాజస్థాన్‌లోని పోఖ్రాన్‌లో విజయవంతంగా అణు పరీక్షలు నిర్వహించి భారతదేశాన్ని ప్రపంచంలోని అణుశక్తి దేశాల సరసన నిలబెట్టి భారతదేశం ఒక శక్తివంతమైన దేశం, ఎటువంటి సమస్యనైనా ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉన్నదని తెలియజేసిన గొప్ప మహానుభావుడు డా.ఏ.పి.జె. అబ్దుల్ కలాం గారు.

డా. ఏ.పి.జె. అబ్దుల్ కలాం గారు చాలా పేద కుటుంబం నుంచి వచ్చిన వ్యక్తి. ముఖ్యంగా దేశ భవిష్యత్ మొత్తం తరగతి గదుల్లో ఉన్నదని నమ్మిన వ్యక్తి. వారు రాష్ట్రపతిగా ఉన్నప్పుడు గానీ రాష్ట్రపతి పదవీ బాధ్యతల నుంచి వైదొలగిన తరువాత కూడా ప్రతిరోజూ విద్యార్థులను కలువకుండా వారు ఉండేవారు కాదు. వారు ఏ రాష్ట్రానికి వెళ్లినా కూడా అక్కడి విద్యార్థులను కలవడం అనేది ఒక విధిగా పెట్టుకున్నారు. అంటే దేశ భవిష్యత్తు పట్ల, యువత ఏ రకమైన ఆలోచనా విధానంతో ఉండాలనేది నేర్పిన మహానుభావుడు. వారికి నిజంగా మన హైదరాబాదుతో అనుబంధమున్నది. వారు మన దేశం కోసం చేసిన పరిశోధనలన్నీ మన తెలంగాణ రాష్ట్రంలోని హైదరాబాదు నగరం నుంచి జరిగినందుకు నిజంగా మనందరం గర్వపడాలి. ఇంత గొప్ప మహానుభావుడు స్వర్గస్థులైనందుకు హైదరాబాదు నిజంగా బాధ

పడింది, తల్లడిల్లింది. ఆ మహానుభావుని ఆలోచనా విధానంతో మన తెలంగాణ రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత ఉన్నది. హైదరాబాదు కేంద్రంగా వారు చేసిన పరిశోధనలన్నీ ప్రపంచమంతా గర్వించదగినవి. గౌరవ ముఖ్యమంత్రి గారు ప్రతిపాదించిన విధంగా డి.ఆర్.డి.ఎల్‌కు అబ్దుల్ కలాం గారి పేరు పెట్టడానికి సంబంధించి కేంద్రప్రభుత్వంతో అందరం కలిసి మాట్లాడి డి.ఆర్.డి.ఎల్‌కు అబ్దుల్ కలాం గారి పేరు పెట్టాల్సిన అవసరమున్నది. ఒక్క డి.ఆర్.డి.ఎల్ మాత్రమే కాకుండా ఇంకా అనేక రకాలుగా వారిని గుర్తించుక్ను విధంగా రూపకల్పన చేసుకుంటే బాగుంటుంది. అబ్దుల్ కలాం గారిని తప్పనిసరిగా భవిష్యత్తులో కూడా గుర్తు చేసుకోవడానికి హైదరాబాదు ప్రజలు, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గుర్తు పెట్టుకోవలసిన బాధ్యత ఉన్నదని గుర్తు చేస్తూ వారికి ఈ సందర్భంగా నా ప్రగాఢమైన సానుభూతిని తెలియజేస్తూ వారి ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తూ సెలవు తీసుకుంటున్నాను.

శ్రీ ఎస్. రాజేందర్ రెడ్డి (నారాయణపేట్): అధ్యక్షా, వ్యక్తికన్నా దేశం గొప్పదని నిజాయితీగా నమ్మిన నిష్కళంక జాతీయవాది. శాస్త్ర సాంకేతిక రంగంలో భారతదేశ ఖ్యాతిని ప్రపంచానికి తెలియజేయడమే కాకుండా సామాన్యుల రాష్ట్రపతిగా పేరు గడించిన నిజమైన ప్రజా నాయకుడు, నిత్య కృషీవలుడు. నిరంతర విద్యార్థి స్ఫూర్తి ప్రదాత. డా.ఏ.పి.జె అబ్దుల్ కలాం గారు నిజంగా ఒక మహనీయుడు. ఆ ధ్రువతార, భారత రత్న మనందరినీ వీడి వెళ్లడం కఠినమైన వాస్తవం. రామేశ్వరంలోని నిరుపేద కుటుంబంలో జన్మించి పొట్టకూటి కోసం దినపత్రికలను అమ్ముకొనే స్థితి నుంచి కష్టాలనే నమ్ముకొని ఉచ్ఛ స్థితికి చేరిన తరువాత కూడా తన తోటి సామాన్యులను ఆయన మర్చిపోలేదు.

డా. ఏ.పి.జె అబ్దుల్ కలాం గారు డి.ఆర్.డి.ఎల్ డైరెక్టర్‌గా 01-06-1982 నుంచి 1993 వరకు అంటే పది సంవత్సరాలు బాధ్యతలు నిర్వహించారు. పరిశోధనా రంగంలో భారతదేశం తన కాళ్ల మీద తాను నిలబడేటట్లుగా చేసి భారత దేశం సూపర్ పవర్ కావడానికి బాటలు పరచిన సృజనశీలి. పృథ్వీ, అగ్ని పరీక్షల తరువాత ఆయనను ఇంటర్వ్యూ చేయడానికి వెళితే ఒక చిన్న గదిలో పుస్తకాల మధ్య తన్మయత్వంతో మునిగిపోయిన నిగర్వి అబ్దుల్ కలాం. భగవద్గీత, ఖురాన్‌లను సమానంగా చూసిన నిజమైన భారతీయుడు డా.ఏ.పి.జె. అబ్దుల్ కలాం. ఆయన మారణాయుధాలతోబాటు మానవాభ్యుదయం గురించి ఆలోచించగలిగినవాడు. దేశ తక్షణ అవసరాలతోబాటు భవిష్యత్ అవసరాలను కూడా గుర్తెరిగి వాటిని తీర్చడానికి వారి జీవితాన్ని దారపోసినవాడు.

10.50 ఉ. రణ రంగంలో ఉపయోగించే పరిజ్ఞానాన్ని వైద్య రంగానికి వర్తింపచేయగలిగిన దిట్ట. కలాం గారు సామాన్యుడి గురించి ఆలోచించడమే కాకుండా సామాన్యుడి లాగే జీవించారు. సమాజంపై, భిన్నతరాలపై ఇంతగా ప్రభావం చూపిన వ్యక్తి ఇటీవలి కాలంలో మరొకరు కనిపించరు. కలాం గారు లేని లోటు తీర్చలేనిది. రాష్ట్రపతిగా ఉంటూ కూడా విద్యార్థులలో నిత్యం స్ఫూర్తిని నింపడానికి ఆయన చేసిన కృషి అసమానం మరియు తాను ప్రజా రాష్ట్రపతిని అని ఆయన ఎన్నో సార్లు నిరూపించుకున్నారు. ప్రపంచంలోని అతి ఎత్తైన యుద్ధ క్షేత్రమైన సియాచిన్‌లో రక్తం గడ్డకట్టించే చలిలో పహారా కాస్తున్న భారత సైనికుల దగ్గరికి వెళ్లి పరామర్శించిన తొలి రాష్ట్రపతి. సుఖోయ్ యుద్ధవిమానంలో కూడా ప్రయాణం చేసిన ఏకైక వ్యక్తి కూడా ఆయనే. నియంత్రణ రేఖ వద్ద పనిచేస్తున్న సైనిక బలగాల దగ్గరికి కూడా వెళ్లి మాట్లాడిన వ్యక్తి కూడా ఆయనే. “పుట్టుక నీది చావు నీది బ్రతుకంతా దేశానిదే” అని కాళోజి గారు అన్న మాటలు నేటి తరం నాయకుల్లోని కలాం గారికి సంపూర్తిగా వర్తిస్తాయనడంలో అతిశయోక్తి ఏమీ లేదు. రాష్ట్రపతి భవన్‌ను ఖాళీ చేసే సమయంలో కలాం గారు తన దుస్తులు మరియు సొంత డబ్బులతో కొనుగోలు చేసిన పుస్తకాలతో కూడిన రెండు సూటుకేసులతో మాత్రమే బయటకు వచ్చారు. పోలియో వ్యాధితో కుంగిపోయి మిగతా అందరిలా నడవగలమన్న ఆశ ఏకోశాన కూడా లేక నిరాశనిస్పృహలతో జీవిస్తున్న వాళ్ల జీవితంలో కలాం గారు వెలుగులు నింపారు. ఒకరు కాదు ఇద్దరు కాదు దేశ వ్యాప్తంగా ఉన్నటువంటి పోలియో బాధితులు ఆత్మవిశ్వాసంతో ముందుకు వెళ్తున్నారంటే అందుకు కారణం కలాం గారే. 1993వ సంవత్సరంలో అబ్దుల్ కలాం గారు నిమ్స్ ఆసుపత్రికి వచ్చారు. అప్పటి కాలంలో పోలియో వ్యాధి గ్రస్తులకు నాలుగు కేజీల బరువు ఉన్న క్యాలిపర్స్‌ను అమర్చేవారు. అసలే కాలు సహకరించలేని పరిస్థితుల్లో ఉన్న వారు వాటిని వాడటం నరకంగా భావించే వారు. ఆ విషయాన్ని గమనించిన కలాం గారు రాకెట్‌లో ఉపయోగించే టైటానియం అనే తేలికపాటి లోహంతో పోలియో వ్యాధి గ్రస్తులకు క్యాలిపర్స్‌ను తయారు చేస్తే బాగుంటుందని భావించి మూడు నుంచి నాలుగు కేజీల బరువున్న క్యాలిపర్స్‌ని నాలుగు వందల గ్రాముల బరువుకు తగ్గించిన ఘనత కలిగిన వ్యక్తి కూడా ఆయనే. రామేశ్వరం నుండి రాష్ట్రపతి వరకు ఆయన ప్రయాణించిన తీరు ఒక అద్భుతం. షిల్లాంగ్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్‌లో ఆయన కన్ను మూసే ముందు ఈ భూమిని ఏవిధంగా అందరికి ఆవాస యోగ్యంగా మలచాలని చెప్పాలనుకున్నారు. ఒక క్షణ సమయం కూడా వృథా చేయకుండా తన జీవితం మొత్తాన్ని కూడా ఈ దేశం కోసం ఆయన వెచ్చించారు. చివరి రోజు సైతం అలుపన్నది లేకుండా పని

చేసిన వ్యక్తి కలాం గారు. పార్లమెంట్ విధులకు అడ్డొస్తున్న ఆటంకాలను నిరోధించేందుకు నూతన మార్గాలను కనిపెట్టాలని ఆయన షిల్లాంగ్ ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ విద్యార్థులకు సూచించారు. గొప్ప మహనీయుడైన కలాం గారి ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నాను. ఈ రోజు ముఖ్యమంత్రి గారు ప్రవేశపెట్టిన సంతాప తీర్మానానికి పూర్తిగా మద్దతిస్తున్నాను.

శ్రీ ఎస్.ఏ. సంపత్ కుమార్ (అలంపూర్): అధ్యక్షా, గౌరవ ముఖ్యమంత్రి గారు ప్రవేశపెట్టిన సంతాప తీర్మానానికి సంపూర్ణంగా మద్దతిస్తూ, బలపరుస్తూ దివంగత భారత రత్న డా. ఎ.పి.జె. అబ్దుల్ కలాం గారి ఆత్మకు శాంతి చేకూరాలని మనస్ఫూర్తిగా భగవంతుడిని ప్రార్థిస్తూ, వారికి ప్రగాఢమైన నివాళి అర్పిస్తూ, వారి కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలియజేస్తున్నాను. ఈ రోజు కలాం గారు భౌతికంగా మన ముందు లేకపోయిన దాదాపుగా ఐదు దశాబ్దాలు పాటు వారు చూపించిన ఆశయాలు, లక్ష్యాలు, సిద్ధాంతాలు మన కళ్ల ముందు కదలాడుతూనే ఉన్నాయి. కావున, వాటన్నింటిని స్ఫూర్తిగా తీసుకొని ముందుకు వెళ్లాల్సిన అవసరం ఉన్నది. ఈ తరానికే కాకుండా, భవిష్యత్ తరాలకు కూడా మేలు జరిగే విధంగా శాస్త్రసాంకేతిక రంగంలో ఆయన తీసుకున్న నిర్ణయాలు ప్రతిఫలిస్తున్నాయి. కలాం గారు అనేక రచనలు కూడా చేశారు. స్వామి వివేకానందులు చేసిన సూక్తులు ప్రతి ఒక్కరికి జీవితకాలంలోని ప్రతి దశలో ఏదో ఒకలా ఏవిధంగా అయితే గుండెకు హత్తుకుపోయేలా ఉన్నాయో ఆ విధంగానే కలాం గారు సూచించిన సూక్తులు కూడా ప్రతి ఒక్కరి జీవితంలో ఏదో ఒక దశలో గుండెకు హత్తుకునే విధంగా ఉంటాయి. కేవలం శాస్త్ర సాంకేతిక రంగాలకు సంబంధించిన శాస్త్రవేత్తగానే కాకుండా సామాజిక శాస్త్రవేత్తగా అన్ని వర్గాల ప్రజలకు, అన్ని రంగాలకు హత్తుకుని పోయే విధంగా వారి పనితనం ఉండేది. కావున, వారి స్ఫూర్తితో మన రాష్ట్రం కూడా అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని ఆశిస్తున్నాను. కలాం గారిని భారతదేశంలోనే గొప్ప సైంటిస్ట్ అని చెబుతున్నప్పటికీ కూడా నాకు తెలిసిన మేరకు అణు ఇంధన, రక్షణ రంగంలో ఆయన యావత్ ప్రపంచానికే ఆదర్శంగా నిలిచి, యావత్ ప్రపంచం అణు ఇంధన రంగం, రక్షణ రంగంలో నూతన పుంతలు తొక్కడానికి ఉపయోగపడిన మేధా సంపత్తికి నిలువెత్తు నిదర్శనం. కలాం గారితో కరచాలనం చేయాలని దాదాపు పది సంవత్సరాల పాటు ప్రయత్నం చేసినప్పటికి వీలు పడకపోయినప్పటికీ, చివరగా కలాం గారితో నా కూతురికి 3 నిమిషాల పాటు ఇంట్రాక్ట్ అయ్యే అవకాశం లభించనందుకు నేను చాలా సంతోషించడం జరిగింది. కలాం గారు - He is more than a Prime Minister and he is more than a President in this country అని చెప్పడంలో నాకెటువంటి సంశయం లేదు. కలాం గారు అందించిన స్ఫూర్తితో, ఆలోచనలతో మనమంతా అభివృద్ధి దిశగా ముందుకు వెళ్లాలని కోరుకుంటున్నాను. ముఖ్యమంత్రి గారు ప్రవేశ పెట్టిన తీర్మానాన్ని సమర్థిస్తున్నాను. డి.ఆర్.డి.ఓ కే కాకుండా ఇంకా అణు ఇంధన రంగంలో, రక్షణ రంగంలో లేదా రాష్ట్రంలో ఉన్న వివిధ ఇనిస్టిట్యూట్‌లకు వారు పేరున పెట్టి అనునిత్యం వారిని స్మరించే అవకాశం కలిగేలా చూడాలని కోరుకుంటున్నాను.

శ్రీమతి ఎమ్. పద్మా దేవేందర్ రెడ్డి (మెదక్): అధ్యక్షా, ముఖ్యమంత్రి గారు ప్రవేశపెట్టిన సంతాప తీర్మానాన్ని పూర్తిగా బలపరుస్తున్నాను. విశ్వ విఖ్యాత శాస్త్రవేత్త, మాజీ రాష్ట్రపతి అయినటువంటి డా.పి.జె. అబ్దుల్ కలాం గారు లేరన్న చేదు నిజాన్ని ఇప్పటికీ మనం జీర్ణించుకోలేక పోతున్నాము. హైదరాబాద్ కేంద్రంగా ఎన్నో క్షిపణి పరీక్షలు చేసి యావత్ ప్రపంచాన్ని భారతదేశం వైపుకు చూసేలా చేసిన గొప్ప మహనీయుడు. పేదరికాన్ని, ఎన్నో సవాళ్లను ఎదుర్కొని రాష్ట్రపతి స్థాయికి ఎదిగిన మహానుభావుడు. అంతటి మహనీయుడుతో 12వ శాసనసభలో మాట్లాడే అవకాశం లభించినందుకు నేను ఎంతో సంతోషిస్తున్నాను. వెనకబడిన ప్రాంతాలను అభివృద్ధికి దిశగా ముందుకు తీసుకోపోవడంలో ప్రజాప్రతినిధుల పాత్ర తెలియజేయాలని వారిని ప్రశ్నించగా వారు చాలా సున్నితంగా, ముక్కుసూటిగా, పరుగు పందెం పెట్టుకున్న సందర్భంలో పరుగు మధ్యలో వెనకబడిన, పడిపోయిన వికలాంగుడిని పోటీలో పాల్గొన్న మిగతా వాళ్లందరూ వెనకకు వెళ్లి అతడిని తీసుకువచ్చి లక్ష్యం వైపుకు అందరు ముందుకు వెళ్లడం అనే ఉదాహరణతో సమాధానం ఇవ్వడం నాకు చాలా సంతోషాన్ని కలిగించింది. మన రాష్ట్రానికి అదొక ఉదాహరణగా అనిపించినప్పటికీ గత సమైక్య రాష్ట్రంలో ఆవిధంగా పాటించ లేకపోవడం జరిగినందున మనం పోరాడి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకోవడం జరిగింది. అబ్దుల్ కలాం గారు విద్యార్థినివిద్యార్థులకు, పౌరులకు, ఎంతో మంది వ్యక్తులకు స్ఫూర్తి ప్రదాతగా వెలిగారు. కలాంగారిని అందరు ఆదర్శమూర్తిగా తీసుకుంటారని భావిస్తున్నాను.

**11.00 ఉ.** మిస్టర్ స్పీకర్: భారతదేశ మాజీ రాష్ట్రపతి, భారతరత్న ఖండాంతర క్షిపణి రూపశిల్పి, నిత్యసాత్వికుడు డా.ఎ.పి.జె.అబ్దుల్ కలాం గారి మృతి పట్ల ఈ సభ తీవ్ర సంతాపాన్ని వ్యక్తం చేస్తూ శోకార్తులైన వారి కుటుంబ సభ్యులకు సభ సానుభూతిని తెలియజేస్తున్నది. డా.ఎ.పి.జె.అబ్దుల్ కలాం 1931 అక్టోబర్ 15 న తమిళనాడులోని రామేశ్వరంలో జైనులబ్దీన్, ఆషియమ్మ దంపతులకు

జన్మించారు. రామేశ్వరంలో ప్రాథమిక విద్యను పూర్తి చేసి, రామనాథపురంలో మెట్రిక్యులేషన్ చేశారు. 1954లో మద్రాసు విశ్వవిద్యాలయం నుంచి భౌతిక శాస్త్రంలో పట్టభద్రుడు అయ్యాడు. తరువాత మద్రాసు ఎమ్.ఐ.టిలో ఏరోస్పేస్ ఇంజనీరింగ్ విద్యను అభ్యసించిన తరువాత రక్షణ పరిశోధన అభివృద్ధి సంస్థలో చేరి అంచలంచలుగా ఎదిగారు. 1969లో భారత అంతరిక్ష పరిశోధన సంస్థ ఇస్రోకు బదిలీ అయ్యారు. 1973 నుంచి 1982 వరకు ఎస్.ఎల్.వి ప్రాజెక్ట్ డైరెక్టరుగా, 1980లో ఎస్.ఎల్.వి-3 ద్వారా రోహిణి ఉపగ్రహాన్ని దేశీయ పరిజ్ఞానంతో రూపొందించి అంతరిక్షంలో ప్రవేశపెట్టుటలో ముఖ్య భూమిక పోషించారు. నాగ్, పృథ్వీ, ఆకాష్, త్రిశూల్, అగ్ని, క్షిపణిలను రూపొందించారు. హైద్రాబాద్‌తో స్వర్గీయ డా.ఎ.పి.జె.అబ్దుల్ కలాం గారి అనుబంధం సుదీర్ఘమైనది. డిఆర్‌డిఎల్ డైరెక్టరుగా 1982 నుంచి 1992 వరకు వారు సేవలందించారు. ఆ సమయంలో డా.ఎ.పి.జె.అబ్దుల్ కలాం గారు నిజాం వైద్య విజ్ఞాన సంస్థతో కలసి వైద్య పరికరాలను రూపొందించే పరిశోధన చేశారు. పోలియో సోకిన వారి కాలికి అమర్చే ఫ్లోర్ రియాక్షన్ ఆర్థోసిస్ పరికరం, హృద్రోగులకు వేసే స్టంట్‌లను తక్కువ ధరలకు అందుబాటులోకి తీసుకువచ్చారు. 1992 జూలై నుంచి 1999 వరకు ప్రధానమంత్రికి శాస్త్రీయ సలహాదారులుగా, డిఆర్‌డిఓ కార్యదర్శిగా సేవలందించారు. 1998లో ఫోక్రాన్-2 పేరుతో భారత అణ్వాస్త్ర పరీక్షలు నిర్వహించి ప్రపంచ దేశాలలో భారత ప్రతిష్టను ఇనుమడింప చేశారు. భారత ప్రభుత్వం డా.ఎ.పి.జె.అబ్దుల్ కలాం గారి నిస్వార్థ సేవలకు గుర్తింపుగా 1981 సంవత్సరంలో పద్మభూషణ్, 1990 సంవత్సరంలో పద్మవిభూషణ్, 1997లో భారత రత్న, ఇందిరాగాంధీ జాతీయ సమగ్రత అవార్డు 1990లో వీరసవార్కర్ అవార్డులతో సత్కరించింది. విద్యార్థులకు యువతకు ప్రేరణ అందించి నందుకు ఐక్యరాజ్యసమితి డా.ఎ.పి.జె.అబ్దుల్ కలాం గారి జన్మదినమైన అక్టోబర్ 15ను ప్రపంచ స్టూడెంట్స్ డే గా ప్రకటించింది. డా.ఎ.పి.జె.అబ్దుల్ కలాం గారిని ప్రపంచంలోని 40 విశ్వవిద్యాలయాలు గౌరవ డాక్టరేట్‌తో సత్కరించాయి. 2002 జూలై 25 నుంచి 2007 జూలై 25 వరకు 11వ భారత రాష్ట్రపతిగా డా.ఎ.పి.జె.అబ్దుల్ కలాం గారు పదవి బాధ్యత నిర్వహించారు. సంగీత సాధన, పుస్తక రచన కూడా ఆయనకు ఇష్టమైన వ్యాపకాలు. ఆయన రచనల్లో స్వీయ జీవితానుభావాలు, అధ్యయానుభావాలు రాసిపూసినట్లుంటాయి. ఇండియా 2020, వింగ్స్ ఆఫ్ ఫైర్, ఇగ్నేటెడ్ మైన్స్, ది లుమినస్ స్పార్క్, ఇన్స్‌పైరింగ్ థాట్స్, యు ఆర్ బోర్న్ టు బ్లాసమ్ వంటి గొప్ప రచనలు చేసి విద్యార్థులకు, యువతకు తమ భవిష్యత్తును నిర్మించుకునేందుకు మంచి దారిని చూపారు. డా.ఎ.పి.జె.అబ్దుల్ కలాం గారు 2015 జూలై 22వ తేదీన షిల్లాంగ్‌లోని ఐఐఎం విద్యార్థులతో క్రియేటింగ్ ఏ లయబుల్ ప్లానెట్ ఎర్త్ అనే అంశంపై ప్రశంగిస్తూ గుండెపోటుకు గురై మరణించారు. వీరి ఆత్మకు శాంతి చేకూరాలని రెండు నిమిషాలు మౌనం పాటిద్దాం.

(సభ రెండు నిముషాలు మౌనం పాటించింది)

**2. తెలంగాణ మొదటి శాసన సభ్యులు స్వర్గీయ పట్లోళ్ల కిష్టారెడ్డి గారి మృతి గురించి**

రెండవ సంతాపతీర్మానం స్వర్గీయ పట్లోళ్ల కిష్టారెడ్డి గారి గురించి గౌరవ ముఖ్యమంత్రి గారు మాట్లాడవలసినదిగా కోరుతున్నాను.

శ్రీ కె.చంద్రశేఖర రావు : అధ్యక్షా, మెదక్ జిల్లా నారాయణ ఖేడ్ శాసనసభ్యులు స్వర్గీయ పట్లోళ్ల కిష్టారెడ్డి గారి ఆకస్మిక మరణం పట్ల ఈ సభ తీవ్ర సంతాపాన్ని తెలియజేస్తోంది. శోకార్తులైన వారి కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలియజేస్తున్నాను. పట్లోళ్ల కిష్టారెడ్డి గారి మృతి అందరికి తీవ్ర దిగ్భ్రాంతిని కలిగించింది. 1942 అక్టోబర్ 2న మెదక్ జిల్లా నారాయణ ఖేడ్ మండలం పంచగామ్ గ్రామంలో జన్మించిన పట్లోళ్ల కిష్టారెడ్డి గారు న్యాయవాది వృత్తి నుంచి రాజకీయాల్లోకి వచ్చారు. 1970లో పంచగామ్ సర్పంచ్‌గా ఎన్నికై 10 ఏళ్ల పాటు ఆ పదవిలో కొనసాగారు. ఆ తరువాత నారాయణ ఖేడ్ పంచాయతీ సమితి అధ్యక్షులుగా సేవలందించారు. 1989లో మొట్టమొదటిసారిగా ఎంఎల్‌ఏగా గెలచిన స్వర్గీయ పట్లోళ్ల కిష్టారెడ్డి గారు తిరిగి 1999, 2009, 2014లో కూడా అదే నియోజకవర్గం నుంచి ఎంఎల్‌ఏగా ఎన్నికయ్యారు. గతంలో రెండుసార్లు పిఏసి ఛైర్మన్‌గా బాధ్యత నిర్వహించిన పట్లోళ్ల కిష్టారెడ్డి తెలంగాణ రాష్ట్రంలో మొదటి పిఏసి ఛైర్మన్‌గా ఎన్నికయ్యారు. సీనియర్ ఎంఎల్‌ఏగా మన మధ్య ఉండవలసిన కిష్టారెడ్డి గారు అకాల మరణం పొందడం పట్ల నేను వ్యక్తిగతంగా సానుభూతిని తెలియజేస్తున్నాను. కిష్టారెడ్డి గారితో నాకు 40 సంవత్సరాల వ్యక్తిగత సంబంధం కూడా ఉంది. ఎందుకంటే నేను మెదక్ జిల్లా వాసిని వారు కూడా అదే జిల్లాకు సంబంధించిన వారు. స్వర్గీయ బాగారెడ్డి గారి బంధువుగా వారితో 40 సంవత్సరాలు సుదీర్ఘంగా కలసి పని చేసే అవకాశం నాకు లభించింది. వారు పదవిలో ఉన్నా లేకపోయిన ఏ పార్టీలో ఉన్నా, అందరి శాసనసభ్యులతో తన సహచరులతో, ఇతర నాయకులతో చిరునవ్వుతో కలుపుగోలగా మాట్లాడేటువంటి వ్యక్తి, చాలా హుందాగా వ్యవహరించేటువంటి వ్యక్తి, రాజకీయాలలో కొన్ని విలువలు కూడా నెలకొల్పినటువంటి వ్యక్తి ఆయన. కొన్ని కొన్ని సందర్భాలలో జిల్లా పరిషత్ సమావేశాలలో కావచ్చు, శాసనసభ సమావేశాలలో కావచ్చు ఆవేశకావేశాలు

వచ్చినప్పుడు సర్ది చెప్పి సభను ఒక దారిలో పెట్టేటటువంటి వ్యక్తులలో వారు కూడా ఒకరు. అనేక అనుభవాలు ఉన్నాయి కాబట్టి నేను కూడా బాధతో వారి అంత్యక్రియలకు స్వయంగా హాజరు కావడం జరిగింది. వారికి సంపూర్ణమైన సానుభూతిని తెలియజేస్తూ, వారి కుటుంబ సభ్యులకు కూడా నా వ్యక్తిగతంగా, ప్రభుత్వ పరంగా ప్రగాఢమైనటువంటి సానుభూతిని తెలియజేస్తూ ముగిస్తున్నాను.

శ్రీ కె.జానా రెడ్డి : అధ్యక్షా, పట్లోల్ల కిష్టారెడ్డి గారు మా సహచరుడుగా కాంగ్రెస్ పార్టీ శాసనసభ్యుడిగా కొనసాగుతూ, అకస్మాత్తుగా మరణించడం మా అందరికి బాధాకరం. అంతకంటే మిన్నగా నాకు చేదోడువాదోడుగా ఉంటూ ఇటు అసెంబ్లీలో సమావేశాలలో, అటు పార్టీకి అన్ని విధాలుగా సహకరిస్తున్నటువంటి ఒక మంచి మిత్రుణ్ణి కోల్పోయినందుకు ఇటు వ్యక్తిగతంగా, పార్టీ పరంగా నేను బాధపడుతున్నాను. అదే సందర్భంలో ఆయన వ్యక్తిత్వాన్ని, ఆయన్ని వివరించినటువంటి తీరుని ప్రభుత్వపరంగా ముఖ్యమంత్రిగారు కూడా గమనించి విషయం చెప్పినదాంట్లో ఎంతో సత్యం ఉంది. అంతేకాదు నాకు వ్యక్తిగతంగా కూడా 1981సంవత్సరంలో ఆయన సమితి అధ్యక్షుడిగా ఉన్నప్పుడు నేను ఈ రాష్ట్రమంత్రిగా ఆ ప్రాంతాన్ని పర్యటించిన సమయాల్లో నా వెంట ఒకటి, రెండు రోజులు పర్యటించి, 1983 నుండి ఇప్పటి వరకు సుమారు 32 సంవత్సరాలు అనుబంధంగా, ఆప్యాయతగా ఉన్నాము. పార్టీలు వేరైనా, అన్ని పక్షాలతో సమన్వయాన్ని, సామరస్యాన్ని పాటించడంతో పాటు, అభివృద్ధే ధ్యేయంగా ముందుకు సాగినటువంటి వ్యక్తి. అందుకు నిదర్శన సంకేతం వారి ప్రాంతం అందుకు అక్కడి ప్రజలు ఆయనకు సర్పంచిగా, అధ్యక్షుడిగా నాలుగు పర్యాయాలు శాసనసభ్యుడిగా ప్రజలు ఆయనకు అవకాశమిచ్చారు.

11.10 ఉ. అందుకు అనుగుణంగా ఆ ప్రాంతంలో అన్ని వర్గాల వెనుకబడిన ప్రాంతాల్ని అభివృద్ధి చేయడానికి వివిధ ప్రభుత్వాల్లో చాలా కృషి చేశారు. ఆయన ఇచ్చిన హామీ మేరకు ఇంకేమైన పనులు మిగిలిపోయి ఉంటే మాతో ప్రభుత్వం సహకరించి ఆయన ఆత్మకు శాంతి చేకూర్చాలని ఈ ప్రభుత్వాన్ని కోరుతున్నాను. ప్రత్యేకంగా ఆ జిల్లా కూడా ముఖ్యమంత్రి గారికి సంబంధించిందే కాబట్టి ఆ ప్రాంత ప్రజలకు ఆయన ఇచ్చిన హామీలను నిలబెట్టడానికి ఈ ప్రభుత్వం సహకరించమని విజ్ఞప్తి చేస్తూ మరణం సహజం అయినప్పటికీ జరిగిన సంఘటన బాధాకరం మరియు మాకు తీరని లోటు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని, ఆయన కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలియజేస్తూ సెలవు తీసుకుంటున్నాను.

శ్రీ ఎర్రబెల్లి దయాకర్ రావు : అధ్యక్షా, పటోళ్ల కిష్టారెడ్డి గారి మృతి పట్ల ముఖ్య మంత్రిగారి సంతాప తీర్మానాన్ని బలపరుస్తూ, ఆయన మంచి వ్యక్తిగతసారి జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో మాతోబాటు ప్రక్కనే కూర్చున్నారు. ప్రతి చర్చలోనూ సలహాలు, సూచనలూ ఇచ్చే వ్యక్తి. తెలంగాణ రాష్ట్రంలో పబ్లిక్ అకౌంట్స్ కమిటీకి మొదటి ఛైర్మన్‌గా వ్యవహరించారు. ఆయన రాజకీయాల్లో ఒకేసారి ఎమ్.ఎల్.ఏ గా వచ్చిన వ్యక్తి కాదు. ఒక సర్పంచ్‌గా, సమితి ప్రెసిడెంట్‌గా, సూపర్ బజార్ ఛైర్మన్‌గా, నాలుగు సార్లు శాసన సభ్యునిగా రాజకీయంగా అనుభవం ఉన్న వ్యక్తి. అటువంటి వ్యక్తి చనిపోవడం పార్టీకే కాదు, తెలంగాణ ప్రజలందరికీ బధాకరమైన విషయం. రాజకీయాల్లో ఒక ఆదర్శమైన వ్యక్తి కిష్టారెడ్డి గారని తెలియజేస్తూ, ఆ కుటుంబాన్ని భగవంతుడు అన్ని రకాలుగా ఆదుకోవాలని తెలుగు దేశం పార్టీ తరఫున మరియు వ్యక్తిగతంగా కోరుకుంటున్నాను. రూల్ నెం–77 ప్రకారం రైతుల ఆత్మహత్యల పట్ల ఒక తీర్మానాన్ని ప్రవేశ పెడితే బాగుంటుందని విజ్ఞప్తి చేస్తూ ప్రభుత్వానికి ఒక లెటర్‌ను ఇచ్చాము. పదమూడు వందల మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారు ఆ సమస్యపై కూడా తీర్మానాన్ని ప్రవేశ పెట్టాలని కోరుకుంటున్నాను.

డా.కె.లక్ష్మణ్ : అధ్యక్షా, పటోళ్ల కిష్టారెడ్డి గారు శాసన సభ్యులుగా కొనసాగుతూ అర్థాంతరంగా గుండె పోటుతో మరణించడమనేది అందరినీ ఆశ్చర్యానికి గురి చేసింది. వారు లేని లోటు సభలో చాలా స్పష్టంగా కనపడుతున్నది. తెలంగాణ రాష్ట్రంలో ఆయన ఒక సీనియర్ రాజకీయ వేత్తగా కొనసాగినటువంటి వ్యక్తి. వారు కాంగ్రెస్ పార్టీ శాసన సభ్యులైనప్పటికీ తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి మరియు సంక్షేమం పట్ల అనేక విధాలుగా తపన చెందేవారు. తన రాజకీయ జీవితాన్ని సర్పంచ్‌గా ప్రారంభించి సమితి అధ్యక్షులుగా, నాలుగు పర్యాయాలు ఎమ్.ఎల్.ఏ గా గెలిచారంటే ఈనాడు రాజకీయాల్లో ప్రవేశించినటువంటి కొత్త తరానికి, కొత్త రక్తానికి ఆదర్శంగా స్వీకరించాలి. ప్రస్తుతం ఏ తరమైతే రాజకీయాల్లోకి రావాలని తపన చెందుతున్నారో వారు రాజకీయాల్లో షార్ట్‌కట్ మెథడ్స్ ఉండవనీ, ప్రజల కోసం నిరంతరం కృషి చేసే వ్యక్తులకు తప్పకుండా ప్రజల ఆదరణ ఉంటుంది అనడానికి సాక్ష్యాత్ నిదర్శనం కిష్టారెడ్డి గారు. వారు రెండు పర్యాయాలు పి.ఏ.సి. ఛైర్మన్‌గా కొనసాగినప్పుడు రెండు సార్లు వారితో సభ్యునిగా కలిసి పని చేసే అవకాశం నాకు వచ్చింది. వారు చాలా అనుభవం ఉన్న వ్యక్తిగా పబ్లిక్ అకౌంట్స్ కమిటీకే వన్నె తెచ్చారు. “ కాగ్” ప్రస్తావించిన అంశాలను పి.ఏ.సి. ఛైర్మన్‌గా కొత్త రాష్ట్రంలో నూతన వరవడి సృష్టించాలి, ప్రజా ధనం దుర్వినియోగానికి ఆస్కారం లేనట్టుగా ఖచ్చితంగా కఠినంగా వ్యవహరించాలి, బాధ్యులైన

వారిమీద చర్యలు తీసుకోవాలి కమిటీ సిఫార్సులు చేయాలని, "కాగ్"కు సంబంధించిన రిపోర్టులను వేగవంతం చేసి తరచుగా సమావేశ పరచినటువంటి వ్యక్తి ఆయన. ఒక సందర్భంలో వారం రోజులకు ఒకసారి కమిటీని సమావేశ పరిచి అన్ని విషయాల గురించి గంటల తరబడి చర్చించి సంబంధిత చర్యలు తీసుకోడానికి సిఫారసులు చేసినటువంటి వ్యక్తి ఆయన. వాస్తవంగా పి.ఏ.సి. సమావేశం జరగాల్సిన రోజేవారు పరమపదించారు. పి.ఏ.సి. సమావేశం దృష్ట్యా ఒక రోజు ముందు హైదరాబాద్‌కు వచ్చారని పి.ఏ.సి. జరగాల్సిన రోజే వేకువ జామున నిద్రలో గుండె పోటుతో చనిపోవడం అనేది అందరిని దిగ్భ్రాంతికి గురి చేసింది. ఆయన ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఎల్.ఎల్.బి. పూర్తి చేసి న్యాయ వృత్తిలో కొనసాగుతూ రాజకీయల్లోకి వచ్చినటువంటి వ్యక్తి. వారి అంత్యక్రియలకు మా పార్టీ తరపు నుండి నేను సభ్యులు రామచంద్రారెడ్డి గారు వెళ్తే మొత్తం మా జిల్లా అంతా తరలి వచ్చింది. రాష్ట్రంలో ఉన్నటువంటి పార్టీలకు అతీతంగా నాయకులు వచ్చారంటే వారు ప్రజల్లో పొందినటువంటి ఆదరణ. వారు లేని లోటు కాంగ్రెస్ పార్టీకే కాదు మొత్తం తెలంగాణ రాష్ట్రానికే లోటుగా భావిస్తూ, భగవంతుడు వారి కుటుంబ సభ్యులకు ఆత్మ స్థైర్యాన్ని ప్రసాదించాలని, వారు లేని లోటు తీర్చే విధంగా రాబోవు తరాలు వారిని ఆదర్శంగా తీసుకుని ముందుకు రావాలని కోరుతూ భారతీయ జనతా పార్టీ తరపున ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేస్తూ భగవంతుడు వారి ఆత్మకు శాంతి చేకూర్చాలని ప్రార్థిస్తూ సెలవు తీసుకుంటున్నాను.



శ్రీ పాయం వెంకటేశ్వర్లు: అధ్యక్షా, శాసన సభలో సీనియర్ నాయకులుగా ఉన్న నారాయణ్‌ఖేడ్ శాసన సభ్యులు శ్రీ పటోళ్ల కిష్టారెడ్డి గారు గత నెల 25వ తారీకున గుండె పోటుతో అకాల మరణం చెందారు. వారి జీవిత చరిత్ర చూసినట్లైతే సర్పంచ్ స్థాయి నుండి అంచెలంచెలుగా ఎదుగుతూ పంచగావ్ పంచాయతీ ప్రెసిడెంట్‌గా, నారాయణ్‌ఖేడ్ సమితి ప్రెసిడెంట్‌గా, నాలుగు సార్లు ఎమ్.ఎల్.ఏ.గా పని చేస్తూ నారాయణ్‌ఖేడ్ నియోజకవర్గంలో అనేక అభివృద్ధి మరియు సంక్షేమ కార్యక్రమాలు చేపట్టి ప్రజల వద్దకు చేరుస్తూ, రాజకీయాల్లో వివాద రహితునిగా మంచి పేరు తెచ్చుకున్నారు. నియోజక వర్గంలో మంచి నాయకునిగా పేరు తెచ్చుకున్నటువంటి వ్యక్తి. తొలి తెలంగాణ రాష్ట్రంలో పి.ఏ.సి. ఛైర్మన్‌గా పని చేస్తూ హఠాత్తుగా మరణించడం అనేది బాధకు గురి చేసింది. వారి మరణం పట్ల వై.ఎస్.ఆర్ పార్టీ తరపున సంతాపాన్ని తెలియ పరుస్తూ, వారి కుటుంబ సభ్యులకు సానుభూతిని వ్యక్తం చేస్తూ ముగిస్తున్నాను.

**11.20 ఉ.** శ్రీ సున్నం రాజయ్య : అధ్యక్షా, ముఖ్య మంత్రి గారు ప్రవేశ పెట్టిన పట్లోళ్ల కిష్టారెడ్డి గారి సంతాప తీర్మానాన్ని సి.పి.ఎమ్. పార్టీ తరఫు నుంచి బల పరుస్తున్నాను. కిష్టారెడ్డి గారు వ్యక్తి గతంగా నాకు బాగా తెలిసిన వ్యక్తి. 1999లో మొదటిసారి శాసన సభకు వచ్చినప్పుడు కాంగ్రెస్ పార్టీ ప్రతి పక్షంగా ఉన్నప్పుడు 2000 సంవత్సరంలో విద్యుత్ సమస్యపై ఉద్యమం జరిగినప్పుడు నాతోపాటు ప్రత్యక్షంగా ఉద్యమంలో పాల్గొన్నారు. ఆయన అందరిని కలుపుకొనిపోయే వ్యక్తి. ఆయన మరణ వార్త మనందరిని దిగ్భ్రాంతికి గురి చేసింది. కిష్టారెడ్డిగారు సర్పంచ్‌గా రెండు పర్యాయాలు, సమితి ప్రెసిడెంట్‌గా శాసనసభకు నాలుగు పర్యాయాలు, నారాయణ్ ఖేడ్ నియోజకవర్గం తరపు నుంచి శాసన సభకు ప్రాతినిధ్యం వహించారు. సర్పంచ్ నుంచి చట్టాలు చేసే శాసనసభ వరకు ఎన్నికై ఆ ప్రాంత ప్రజల సంక్షేమాభివృద్ధి కోసం అనేక పథకాలను అమలు చేసిన వ్యక్తి. సర్పంచ్‌గా మరియు న్యాయవాదిగా కూడా ఆయన పనిచేశారు. తెలంగాణ శాసనసభలో పి.ఏ.సి. ఛైర్మన్‌గా ఉంటూ అకాల మరణం చెందడం రాష్ట్రానికి తీరని నష్టం. ప్రజాప్రతినిధి ఎంత చిన్న వయసు వారినైనా కూడా మర్యాదగా పలకరించే వ్యక్తి మరణించడం తెలంగాణ రాష్ట్రానికి తీరని లోటు. ఆయన కుటుంబానికి సి.పి.ఎమ్. పార్టీ తరపున ప్రగాఢ సంతాపాన్ని తెలియచేస్తూ సెలవు తీసుకుంటున్నాను.

శ్రీ రవీంద్ర కుమార్ రమావత్ : అధ్యక్షా, మన సహచర శాసన సభ్యులు, శాసనసభలో సీనియర్ నాయకులుగా ఉన్న పట్లోళ్ల కిష్టారెడ్డిగారి మరణ వార్త మనందరిని చాలా దిగ్భ్రాంతికి గురి చేసింది. 1970 సంవత్సరంలోనే వారి గ్రామం నుంచి ఎన్నికై సమితి ప్రెసిడెంట్‌గా నాలుగు సార్లు, పి.ఏ.సి. కమిటీకి ఛైర్మన్‌గా రెండు పర్యాయాలు పని చేశారు. ఆయన జీవిత కాలంలో సగ భాగం ప్రజలతో కలసి పని చేసే మంచి అవకాశాన్ని వారు పొందినట్లుగా మేము భావిస్తున్నాము. క్షేత్ర స్థాయిలో సామాన్య ప్రజల మధ్యలో ఉంటూ ప్రజా సమస్యలపై అవగాహన కలిగి ఉంటూ నాలుగు సార్లు

శాసనసభ్యుడిగా గెలవడమంటే మామూలు విషయం కాదు. శాసనసభలో పెద్ద దిక్కుగా ఉండే కిష్టారెడ్డిగారు దూరం కావడమన్నది చాలా బాధాకరం. వారి యొక్క రాజకీయ జీవితం మనందరికీ స్ఫూర్తిగా నిలవాలని, వారి కుటుంబసభ్యులకు సి.పి.ఐ. పార్టీ తరఫున ప్రగాఢ సానుభూతిని తెలియచేస్తూ సెలవు తీసుకుంటున్నాను.

శ్రీ పోచారం శ్రీనివాస రెడ్డి (వ్యవసాయ శాఖ మంత్రి): అధ్యక్షా, నారాయణ్‌ఖేడ్ శాసన సభ్యులు కీర్తిశేషులు పట్లోళ్ళకిష్టారెడ్డి గారి మరణం పట్ల గౌరవ ముఖ్య మంత్రి గారు ప్రవేశ పెట్టిన సంతాప తీర్మానాన్ని బల పరుస్తున్నాను. పట్లోళ్ళ కిష్టారెడ్డి, మా నియోజక వర్గాలు చాలా దగ్గరగా ఉంటాయి. వారితో నాకు వ్యక్తి గతంగా చాలా మంచి అనుబంధం ఉంది. ఐదు దశాబ్దాలుగా రాజకీయ జీవితాన్ని మడమ తిప్పకుండా ధైర్యంతో కొనసాగించిన వ్యక్తి. ఆ నియోజకవర్గ రాజకీయ పరిస్థితుల్లో మరొకరు ఉంటే తట్టుకొని ఉండేవారు కాదు. అక్కడున్న పరిస్థితుల్లో ధైర్యంగా నిలబడి ప్రజల సంక్షేమం కోసం ప్రజల అభివృద్ధి కోసం ఎల్లవేళలా కృషి చేసిన వ్యక్తి. వారు గత శాసన సభలో బడ్జెట్ సమావేశాల్లో కాంగ్రెస్ పార్టీ తరఫున మాట్లాడే అవకాశం వచ్చినప్పుడు ఏనాడు విమర్శలకు తావు ఇవ్వకుండా చక్కటి సలహాలు ఇచ్చిన వ్యక్తి. వారి అనుభవం వారి మాటల్లో మాకు అర్థమయ్యింది. విమర్శించడమే కర్తవ్యంగా కాకుండా చాలా సహృదయంతో ఎక్కడ విమర్శించాలో విమర్శిస్తూ, సలహాలు ఇస్తూ ప్రభుత్వం చేసేటటువంటి కార్యక్రమాలను మనస్ఫూర్తిగా సమర్థించిన వ్యక్తి. అలాంటి వ్యక్తి సభలో ఉండడం చాలా మంచిది, అలాంటి వ్యక్తి యొక్క వ్యక్తిత్వాన్ని ఈ తరం వారు పార్టీల కతీతంగా శాసన సభ్యులందరూ వారి యొక్క జీవితాన్ని ఒకపాఠంగా నేర్చుకుంటే మనకు, సమాజానికి మంచిది. శాసనసభలో వారు ఉండుంటే వారి మాటలు, సూచనలు, సలహాలను స్వీకరించేవాళ్లం. అటువంటి వ్యక్తి ఈ రోజు లేకపోవడం చాలా బాధాకరం. ఆయన మాటల్లో చాలా ఆప్యాయత ఉంటుంది. స్నేహితుడిగా, రాజకీయంగా అజాత శత్రువుగా ఉండేవారు. వారి కుటుంబానికి ప్రగాఢమైన సానుభూతిని వ్యక్తపరుస్తూ, వారి మరణం పట్ల తీవ్ర సంతాపాన్ని వ్యక్తం చేస్తున్నాను. వారికి ఆత్మకు శాంతి చేకూర్చాలని భగవంతుని కోరుకుంటూ సెలవు తీసుకుంటున్నాను.

డా. జె. గీత (జహీరాబాద్) : అధ్యక్షా, తొలి శాసన సభ జరుగుతున్నప్పుడు మెదక్ జిల్లాకు చెందినటువంటి మా సహచరులు, పెద్దలు, సిట్టింగ్ ఎమ్.ఎల్.ఏ. అయిన కిష్టారెడ్డి గారు లేరంటే నాకు నమ్మశక్యం కావడం లేదు. వారి మరణ వార్త మనందరికీ దిగ్భ్రాంతిని కలిగించింది. కనిపించిన ప్రతీసారి మేము పలకరించుకునే వాళ్లం. కాంగ్రెస్ పార్టీకే కాదు, జిల్లాకే కాదు, యావత్ మన రాష్ట్రానికే ఆయన లేని లోటు ఉందనే భావన తెలుసుకుని నేను గర్విస్తున్నాను. మా జిల్లాకు చెందిన కిష్టారెడ్డి గారు పెద్ద వారు, పెద్దలు సుదీర్ఘ రాజకీయ అనుభవం కలిగిన వ్యక్తి. ప్రతి ఒక్కరికి సలహాలు సూచనలు ఇచ్చేందుకు యోగ్యత కలిగిన వ్యక్తి. నాకు వ్యక్తిగతంగా కూడా ఆయన లేనిది తీరని లోటు. 1989లో ఇద్దరం కలిసి రాజకీయాల్లోకి వచ్చాము. పెద్ద, చిన్న అనే సంబంధం లేకుండా అందరికీ సలహాలు ఇచ్చే వ్యక్తి. ఏ విషయాన్నైనా నిర్మొహమాటంగా చెప్పేవారు. అటువంటి అండదండలు ఇప్పుడు లేకపోవడం బాధాకరం. నేను ఎప్పుడు జిల్లా పరిషత్‌కు మరియు సమావేశాలకు హాజరయ్యే సమయంలో ఏమి మాట్లాడితే బాగుంటుందని అడిగేదాన్ని. కానీ ఇప్పుడు ఎవరిని అడగాలో తెలియడం లేదు. మా జిల్లాలోని సమస్యల పట్ల ఇద్దరం పరస్పరం సలహాలు, సూచనలు చేసుకునేవాళ్లం.

11.30 ఉ.

అపోజిషన్ పాత్ర ఎలా నిర్వహించాలో చాలా సలహాలు చెప్పే వారు. ఆ రోజు కూడా పిఎసి సమావేశం ఉంది. ఆయన పిఎసి ఛైర్మన్‌గా ఉన్నారు. నేను ఆ రోజు అసెంబ్లీలో కలుసుకుంటానని అనుకున్నాను. నేను పియుసి కమిటీలో సభ్యురాలిని. ఆ రోజు కొన్ని విషయాలు ఆయనతో చర్చించాలని ఎంతో ఆశతో అసెంబ్లీకి వచ్చిన తరువాత కిష్టారెడ్డిగారు చనిపోయారని తెలిసింది. ఆయన చాలా మంచి వ్యక్తి. ఆయన అజాత శత్రువు. పంచాయితీ రాజ్ మీద ఎక్స్‌పర్ట్‌గా అసెంబ్లీలో చర్చించే వారు. నారాయణఖేడ్‌లో నాలుగుసార్లు శాసనసభ్యుడిగా ఎన్నికయ్యారు. సర్పంచ్‌గా, సమితి ప్రెసిడెంట్‌గా పిఎసి ఛైర్మన్‌గా పని చేయడం చిన్న విషయం కాదు. నారాయణఖేడ్‌కు ఒక మంచి ఒరవడి సృష్టించారు. సురేష్‌షట్కార్, కిష్టారెడ్డిగారు ఇద్దరూ ఎమ్ఎల్ఏ సీటు కోరుకునేవారు. కాని వారిద్దరిలో ఒక మంచి అండర్‌స్టాండింగ్ ఉంది. ఒకసారి నువ్వు, ఒకసారి నేను అన్నట్టుగా, నమ్ముకున్న పార్టీ కాంగ్రెస్ జెండా నారాయణఖేడ్‌లో ఎగరాలని, పార్టీకి నష్టం వాటిల్లవద్దని ఎంతో పెద్ద హృదయంతో ఒకరి సారి ఒకరు మరొకసారి ఇంకొకరు అనే అండర్‌స్టాండింగ్‌తో కాంగ్రెస్ జెండాను కిష్టారెడ్డిగారు ఎగురవేశారు. ఇప్పుడు కూడా ఆ ఒరవడి కొనసాగించాలని వాంఛిస్తున్నాము.

ముఖ్యమంత్రిగారు కూడా వారి అంత్యక్రియలకు రావడం, గవర్నమెంట్‌పరంగా అంత్యక్రియలు నిర్వహించడాన్ని మేము అభినందిస్తున్నాము. ప్రజల మనిషిగా, ప్రజలతో మమేకమై, ప్రజల గురించి ఆలోచించే వ్యక్తి ఆయన. వారి విషయంలో అన్ని పార్టీలు ఇంత ఆత్మీయత ప్రదర్శిస్తున్నాయి. నేను ఒకటే కోరుతున్నాను. మెదక్ జిల్లాకు చెందిన ప్రజా ప్రతినిధిగా అందరి మనసు దోచుకున్న వ్యక్తి,

అందరి మన్ననలు పొందిన వ్యక్తి . రానున్న తరాలకు స్పూర్తిదాయకమైన రాజకీయ జీవితం గడిపిన వ్యక్తి ఆయన. వారికి అసలైన నివాళి అర్పించాలంటే ప్రభుత్వాన్ని ముఖ్యమంత్రిగారిని కోరేది ఏమిటంటే వారి కుటుంబ సభ్యులకు యునానిమస్‌గా ఆయన సీటును వదలి వేస్తే బాగుంటుందని నా చిన్న మనవి. అన్ని పార్టీల వారికి కూడా విజ్ఞప్తి చేస్తున్నాను. ఆయన గురించి మనం పెద్దయెత్తున ఘనంగా మాట్లాడుతున్నాము. అందరికీ జీవితంలో ఉదాహరణగా నిలిచిన వ్యక్తి కిష్టారెడ్డిగారికి, ఇంత సుధీర్ఘ రాజకీయ జీవితం ఉన్న వ్యక్తికి, ప్రభుత్వం అన్ని పార్టీల వారికి ఒక రిక్వెస్ట్. మనం కూడా మంచి ఒరవడి సృష్టించిన వాళ్లమవుతామని ఈ ప్రస్థావన మీ ముందుకు తెస్తున్నాము. వారి కుటుంబానికి నా సంతాపం తెలియచేస్తున్నాను. మా కిష్టన్న ఎక్కడున్నా తప్పనిసరిగా వారికి దేవుడు మనశ్శాంతి కలిగిస్తాడని నమ్మకంతో ముగిస్తున్నాను.

డా. జి. చిన్నారెడ్డి (వనపర్తి): అధ్యక్షా, గౌరవనీయులు పట్లోళ్ల కిష్టారెడ్డిగారి అకాల మరణం సందర్భంగా ముఖ్యమంత్రిగారు ప్రవేశపెట్టిన సంతాప తీర్మానాన్ని హృదయపూర్వకంగా సమర్థిస్తున్నాను. నాకంటే ముందు మాట్లాడిన పెద్దలు చెప్పిన విధంగా కిష్టారెడ్డిగారు కొత్తగా ఏర్పడిన ఈ తెలంగాణ రాష్ట్రంలో ఒక సీనియర్ శాసనసభ్యుడు, కాంగ్రెస్ పార్టీలో కూడా చాలా సీనియర్ నాయకుడు ఆయన. ఈ దేశంలో ఇద్దరు మహానుభావులు మహాత్మాగాంధీగారు, లాల్ బహదూర్ శాస్త్రిగారు జన్మించిన అక్టోబర్ 2 న 1942లో కిష్టారెడ్డిగారు జన్మించారు. వారి బాల్యం పాఠశాల విద్య అంతా నారాయణఖేడ్‌లో పొంది, ఉస్మానియా విశ్వ విద్యాలయంలో బిఏ పట్టాను, ఎల్ఎల్‌బి పట్టాను పొందారు. ఎల్ఎల్‌బిలో గోల్డ్ మెడల్ కూడా పొందడం జరిగింది. తరువాత వారి స్వంత గ్రామం అయిన పంచగావ్ గ్రామానికి మూడు, నాలుగుసార్లు సర్పంచ్‌గా పని చేయడం జరిగింది. తరువాత కొంత కాలం సంగారెడ్డి కోర్టులో పిపిగా పని చేశారు. చాలా కాలం తరువాత పంచాయితీ సమితి ఎన్నికలు నిర్వహించబడినప్పుడు నారాయణఖేడ్‌లో 1981లో పంచాయితీ సమితి అధ్యక్షునిగా ఎన్నుకోవడం జరిగింది. దానికంటే ముందు నారాయణఖేడ్ కాంగ్రెస్ పార్టీ ప్రెసిడెంట్‌గా, తాలూకా సూపర్‌బజార్ ఛైర్మన్‌గా పని చేశారు. 1989లో మేమందరం మొదటిసారి వారితో పాటు ఎమ్ఎల్ఏగా ఎన్నుకోబడి ఈ సభకు రావడం జరిగింది. వారితో పాటు మూడు పర్యాయాలు మూడు సార్లు ఎమ్ఎల్ఏగా ఎన్నికయ్యారు. వారు నాలుగు సార్లు ఎన్నికయ్యారు. నేను కూడా నాలుగుసార్లు ఎన్నికయ్యాను. మధ్యలో ఒక టర్మ్ మాత్రం మా ఇద్దరికి కోఇన్‌సైడ్ కాలేదని సవినయంగా మనవి చేస్తున్నాను. అదే విధంగా వారికి మంత్రి కావాలనే కోరిక చాలా ప్రగాఢంగా ఉండేది. అది తీరలేదని మీకు మనవి చేస్తున్నాను. టిటిడి బోర్డు మెంబర్‌గా పని చేశారు. పిఏసి ఛైర్మన్‌గా పని చేశారు. తెలంగాణ శాసనసభలో కాంగ్రెస్ పార్టీ తరపున వారిని ప్యానెల్ స్పీకర్‌గా ఎంచుకోవడం జరిగింది.

కిష్టారెడ్డిగారికి వ్యవసాయం చాలా ఇష్టమైన వృత్తి. వారు చాలా పెద్ద రైతు. దాదాపుగా 70 టన్నులు షుగర్‌కేన్ ఉత్పత్తి చేసిన ఘనత వారికి ఉంది. వారికి నలుగురు కుమారులు, ఒక కూతురు. పోచారం శ్రీనివాసరెడ్డిగారు చెప్పిన విధంగా వారి నియోజక వర్గానికి ఇచ్చిన అమ్మాయి 20 సంవత్సరాల క్రితం చనిపోవడం జరిగింది. ఆ అమ్మాయికి ఒక అబ్బాయి. ఆ అబ్బాయి కూడా అక్టోబర్ 2వ తేదిన పుట్టాడు. ఆ మనుమడంటే అంటే కిష్టారెడ్డిగారికి చాలా ఇష్టం . గీతారెడ్డిగారు ప్రపోజ్ చేసిన విధంగా నేను తమరి ద్వారా విజ్ఞప్తి చేస్తున్నాను.

అదే మాదిరిగా తెలంగాణ ఉద్యమంలో బాగారెడ్డిగారి నాయకత్వంలో 1969లో జైలుకు వెళ్లిన వ్యక్తి కిష్టారెడ్డిగారు అని మనవి చేస్తున్నాను. 2009 నుండి 2014లో వరకు తెలంగాణ వాదిగా తెలంగాణ రావాలని పోరాటం చేసిన వ్యక్తి ఆయన. వారు అకాల మరణం చెందారు కాబట్టి వారి పెద్ద కుమారుడు గతంలో జెడ్‌పిటిసిగా పని చేశారు. ఇప్పుడు ఎమ్‌పిపిగా ఉన్నారు. ఈ అసెంబ్లీ బై ఎలక్షన్ గురించి నోటిఫికేషన్ వచ్చిన సమయంలో గౌరవ ముఖ్యమంత్రిగారు, అన్ని రాజకీయ పక్షాల నాయకులు ఏకగ్రీవంగా ఈ నియోజకవర్గాన్ని వారి కుటుంబ సభ్యులకు రాజకీయాలలో ఉన్న వారి పెద్ద కుమారుడిని ఎమ్ఎల్ఏగా ఏకగ్రీవంగా ప్రపోజ్ చేస్తే బాగుంటుందని తెలియ చేస్తున్నాను. కిష్టారెడ్డిగారి ఆత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంబ సభ్యులకు ధైర్య సాహసాలు ఇవ్వాలని మనసారా కోరుకుంటూ సెలవు తీసుకుంటున్నాను.

11.40 ఉ.

శ్రీమతి ఎమ్. పద్మాదేవేందర్ రెడ్డి : అధ్యక్షా, గౌరవ ముఖ్యమంత్రి గారు ప్రవేశపెట్టిన సంతాప తీర్మానాన్ని బలపరుస్తున్నాను. మన గౌరవ శాసన సభ్యులు శ్రీ పి. కిష్టారెడ్డి గారు హఠాత్తుగా మరణం చెందడం దురదృష్టకరం. 2001 సంవత్సరంలో నేను జడ్‌పీటీసీగా ఉన్నప్పుడు వారు శాసనసభ్యునిగా ఉన్నారు. నేను జెడ్‌పీటీసీగా ఉన్నప్పుడు ఎన్నో సందార్భాలలో వారు మాకు సలహాలు, సూచనలు ఇచ్చారు. వారు మాకు మార్గదర్శకంగా ఉండేవారు. వారు అజాత శత్రువు. వారు ఎవరినీ ఇబ్బంది పెట్టకుండా, వారి నియోజకవర్గానికి మాత్రమే పరిమితమై ఉండేవారు. నారాయణ్‌ఖేడ్ నియోజకవర్గం చాలా వెనుకబడిన నియోజకవర్గం. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం వచ్చిన తరువాత, పలు అభివృద్ధి కార్యక్రమాలకు అక్కడ శంఖుస్థాపన చేయడం జరిగింది. నేను చాలా సందర్భాలలో ఆ

కార్యక్రమాలలో పాల్గొనడం జరిగింది, వారు నన్ను ఒక ఆడబిడ్డగా సాదరంగా ఆదరించేవారు. ప్రభుత్వం చేసే మంచి కార్యక్రమాలను వారు సమర్ధించేవారు. మంచి కార్యక్రమాలను ప్రభుత్వం చేపడుతుందని ప్రస్ఫుటంగా ఒప్పుకునేవారు. అలాంటి మంచి వ్యక్తి ఈరోజు మన మధ్యలో లేకపోవడం దురదృష్టకరం. వారి కుటుంబానికి నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, వారి ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని కోరుకుంటున్నాను.

శ్రీ టి. జీవన్ రెడ్డి (జగిత్యాల): అధ్యక్షా, మిత్రులు కిష్టారెడ్డి గారు మన మధ్య లేకపోవడం చాలా బాధాకరం. మిత్రులు కిష్టారెడ్డి గారు నాకు 1981 సంవత్సరం నుండి పరిచయం. అప్పటి పంచాయతి సమితి ఎన్నికలలో, వారు, నేను, జానా రెడ్డి గారు కూడా పంచాయతి సమితి అధ్యక్షులుగా ఎంపిక కావడం జరిగింది. నాకు అప్పటి నుండీ కిష్టారెడ్డి గారు పరిచయం. గ్రామీణ ప్రాంత అభివృద్ధే తన లక్ష్యంగా పని చేశారు. ఏ సందర్భం వచ్చినా వ్యవసాయం, రైతాంగం, స్థానిక సంస్థల బలోపేతంపై చర్చించే వారు. వారు వాస్తవంగా విద్యాధికులు. న్యాయ శాస్త్రంలో పట్టా పొందినటువంటి వారు. అయినప్పటికీ, వారి దృష్టిఅంతా గ్రామీణ ప్రాంతరైతాంగంపైనే ఉండేది. వారు చిన్నప్పుడే సర్పంచ్‌గా ఎంపికయ్యారు. దాదాపు అయిదు దశాబ్దాల కాలం నుండి నారాయణ్‌ఖేడ్ నియోజకవర్గ ప్రజలకు సేవలు అందిస్తూ, వివాదరహితుడిగా పేరుగాంచారు. అందరూ పేర్కొన్నట్లు ఆయన అజాత శత్రువు, సౌమ్యుడు. ఏ విధమైన వివాదాలకు తావివ్వకుండా సామరస్యపూర్వకంగా సమస్యలు పరిష్కరింపబడాలనే ఆలోచన కలవారు కిష్టారెడ్డి గారు. వారు పీఏసి ఛైర్మన్‌గా కూడా ఉన్నారు. నీతివంతమైన పాలనను అందించాలి, ప్రభుత్వ కార్యక్రమాలలో అవినీతికి చోటు ఇవ్వరాదని, జరిగిన పొరపాట్లను ఎత్తి చూపి, పబ్లిక్ అకౌంట్స్ కమిటీ ఛైర్మన్‌గా తన బాధ్యతను నెరవేర్చారు. వారు మన మధ్య లేకపోవడం దురదృష్టకరం. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుతోనే ఈ ప్రాంతం అభివృద్ధి పథంలో పయనింపబడుతుందన్న సిద్ధాంతాన్ని నమ్ముకున్నటువంటి వారు కిష్టారెడ్డి గారు. 1969లో, బాగారెడ్డి గారితో వారికున్నటువంటి అనుబంధంతో, బంధుత్వంతో, ఆనాటి ఉద్యమ కార్యక్రమంలో ముందు వరుసలో నిలబడి జైలుకి వెళ్లడం జరిగింది. తదుపరి కూడా 2009-14 మధ్యకాలంలో అధికార పార్టీ శాసనసభ్యుడిగా ఉండి కూడా తెలంగాణ రాష్ట్రఏర్పాటు అంశంపై, సందర్భం వచ్చినప్పుడల్లా అధికార పార్టీని ఎదురించే విధంగా తెలంగాణ రాష్ట్రం కోసం కట్టుబడినటువంటి సిద్ధాంతాలు కలిగిన వ్యక్తి కిష్టారెడ్డి గారు అధ్యక్షా. వారు మన మధ్య లేరనే విషయాన్ని ఊహించుకోలేకపోతున్నాము. వారు లేని లోటును మనం తీర్చుకోలేము. గౌరవ ముఖ్యమంత్రి గారు పేర్కొనట్లు, వారు స్వయంగా ముఖ్యమంత్రి గారి జిల్లావాసులే. ముఖ్యమంత్రి గారికి కూడా గత నాలుగు దశాబ్దాలుగా, వారితో, వారి కుటుంబంతో అనుబంధం ఉంది. పూర్తిస్థాయిలో పదవిని అనుభవించాలని ఎవరైనా అనుకుంటారు. వారి మరణంతో ఏర్పడబోయే ఖాళీని, ఉప ఎన్నికల్లో వారి కుటుంబ సభ్యులలో ఒకరితో భర్తీ చేసే విధంగా ఎన్నికలను ఏకగ్రీవం చెయ్యాలనే సూచనను ఏదైతే సోదరి గీతారెడ్డి గారు చెప్పారో, ఆ విషయమై గౌరవ ముఖ్యమంత్రి గారు పరిశీలించి, సానుకూలంగా స్పందిస్తారని భావనను వ్యక్తపరుస్తూ, వారు ప్రవేశపెట్టిన ఈ తీర్మానాన్ని సంపూర్ణంగా బలపరుస్తూ కిష్టారెడ్డి గారి ఆత్మకు శాంతి కలగాలని భగవంతుడిని ప్రార్థిస్తూ, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ సెలవు తీసుకుంటున్నాను.

శ్రీమతి డి.కె. అరుణ (గద్వాల): అధ్యక్షా, పెద్దలు కిష్టారెడ్డి గారు, మన మధ్య ఈ సమావేశాలలో లేకపోవడం చాలా బాధ కలిగిస్తోంది. వివాదరహితుడిగా, సీనియర్ శాసనసభ్యుడిగా, ప్రత్యేక తెలంగాణ రాష్ట్రంలో మొట్ట మొదటి సమావేశం నుండి అనేక అంశాలపై చర్చ జరుగుతున్నప్పుడు, మా పక్కనే ఉండి మాకు అనేక సూచనలు, సలహాలు ఇస్తుండేవారు. లాస్ట్ టర్మ్‌లో, ఈ టర్మ్‌లో కూడా వారితోబాటు నేను కూడా ఎన్నికల్లో విజయం సాధించాను. నేను మెదక్ జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రిగా ఉన్నప్పుడు, జిల్లాలో ఉన్నటువంటి సమస్యలపైన డీఆర్‌సి నిర్వహించినప్పుడు, అనుభవజ్ఞులుగా, సీనియర్ శాసన సభ్యుడిగా అనేక సూచనలు, సలహాలతో ఆ డీఆర్‌సి సభను చక్కగా నిర్వహించే విధంగా నన్ను ప్రోత్సహించారు. కిష్టారెడ్డి గారు చనిపోయే ముందు రోజు, గాంధీ భవన్‌లో దాదాపు మూడు గంటలు మేమంతా వారితో కలిసే ఉన్నాము. చాలా సమయం పార్టీ కార్యక్రమాలపై మాట్లాడుకున్నాము. ఆ రోజు వారు చాలా ఉల్లాసంగా, ఉత్సాహంగా కనిపించారు. మరుసటి రోజు ఉదయం ఈ వార్తను విన్నప్పుడు నాకు చాలా బాధ అనిపించింది, ఆ వార్త నన్ను దిగ్భ్రాంతికి గురి చేసింది. కిష్టా రెడ్డి అన్న సుదీర్ఘ రాజకీయ జీవితం ఉన్నటువంటి వ్యక్తి. మెదక్ జిల్లాలోని నారాయణ్‌ఖేడ్ నియోజకవర్గం ప్రజలు ఆ రోజు ఒక ఆప్తుడుని, కుటుంబంలోని వ్యక్తిని కోల్పోయాము అనే విధంగా రోధించారు. ఆ జన సందోహాన్ని చూసి చాలా బాధ పడ్డాము. ముఖ్యమంత్రి గారు కూడా అక్కడకి వచ్చారు, జిల్లా ఎంఎల్ఏలే కాకుండా, పోచారం శ్రీనివాస రెడ్డి గారు కూడా వచ్చారు. వాళ్లు, వాళ్లకున్నటువంటి అనుబంధంతో అక్కడికి వచ్చారు. ఆ ప్రజలలో ఉన్నటువంటి బాధను, ఆ జన సందోహాన్ని చూసి ఒక మంచి

వ్యక్తిని పోగొట్టుకున్నామని బాధ పడ్డాము. కాంగ్రెస్ పార్టీ మంచి నాయకుడిని కోల్పోయింది. తెలంగాణ రాష్ట్రం మంచి నాయకుడిని కోల్పోయిందని ఈ సందర్భంగా తెలియజేస్తున్నాను. ఇంతకు ముందు పెద్దలు గీతారెడ్డి గారు, చిన్నా రెడ్డి గారు, జీవన్ రెడ్డి గారు చెప్పారు. ముఖ్యమంత్రి గారు కూడా, వారి జిల్లా వాసి కాబట్టి, వారి కుటుంబ సభ్యులలో ఒకరికి ఎంఎల్ఏ పదవినిచ్చే విధంగా ఉపఎన్నికలను ఏకగ్రీవం చేయాలని, దానికి అందరూ సహకరించాలని కోరుతూ, కిష్టారెడ్డి గారి ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ, వారి కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ సెలవు తీసుకుంటున్నాను.

11.50 ఉ. శ్రీ టి. హరీష్‌రావు (శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి): అధ్యక్షా, ముఖ్యమంత్రి గారు ప్రవేశపెట్టిన తీర్మానాన్ని బలపరుస్తూ, నేను ఏ జిల్లాలోనైతే మంత్రిగా పనిచేస్తున్నానో ఆ జిల్లాలో గౌరవనీయులు శ్రీ పి. కిష్టారెడ్డి గారు ఒక సీనియర్ శాసనసభ్యుడిగా వారితోబాటు పనిచేసే అవకాశం నాకు దక్కింది. వారి రాజకీయ జీవితంలో పది సంవత్సరాలపాటు సర్పంచ్‌గా, అయిదు సంవత్సరాలు పంచాయతీ సమితి అధ్యక్షుడిగా, మధ్యలో కొంత కాలం సంగారెడ్డి జిల్లా కోర్టులో ప్రభుత్వ ప్లీడర్‌గా కూడా వారు పని చేశారు. అదే విధంగా నాలుగుసార్లు అంటే 1989, 1999, 2009, 2014లో శాసనసభ్యుడిగా పనిచేశారు. వారు రెండు సార్లు పబ్లిక్ అకౌంట్స్ కమిటీ ఛైర్మన్‌గా కూడా పనిచేశారు. వారు సీనియర్ శాసనసభ్యులు, పబ్లిక్ అకౌంట్స్ కమిటీ ఛైర్మన్ అయినప్పటికీ జిల్లా పరిషత్‌లో జరిగే స్టాండింగ్ కమిటీ సమావేశాలకు తప్పనిసరిగా హాజరై ప్రతి సమావేశంలో ప్రతి చిన్న విషయాన్ని కూడా బాగా చర్చించేవారు. వారు అనేక సందర్భాలలో అధికారపక్షం, ప్రతిపక్షం అనే బేధాభిప్రాయం లేకుండా మంచి కార్యక్రమాల గురించి మంచిగా మాట్లాడటమే కాకుండా చక్కటి సూచనలు కూడా చేసేవారు.

రాష్ట్రప్రభుత్వం 23,ఆగస్టు, 2015నఘనంగా ప్రారంభించిన గ్రామజ్యోతి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ గారు నారాయణ్‌ఖేడ్ నియోజకవర్గంలోని మన్నూరు మండలం రాణాపూర్ గ్రామాన్ని దత్తత తీసుకొన్న కార్యక్రమంలో కూడా కిష్టారెడ్డి గారు చాలా చురుకుగా పాల్గొన్నారు. వారు గ్రామజ్యోతి కార్యక్రమంలో పాల్గొని హైదరాబాదుకు వచ్చి పబ్లిక్ అకౌంట్స్ కమిటీ మీటింగ్ రెండు రోజులు నిర్వహించుకోవాలని భావించి రాత్రంతా సమావేశానికి సంబంధించిన నోట్స్ చదువుకొని నిద్రలోనే వారు హఠాన్మరణం చెందడం చాలా బాధాకరం. జిల్లా పరిషత్ మీటింగులలో గానీ ఇతర మీటింగులలో గానీ వారు కలిసినప్పుడు గతంలో ఎన్నడూ జరగని అభివృద్ధి కార్యక్రమాలు ఈ ప్రభుత్వం హయాంలో నారాయణ్‌ఖేడ్ నియోజకవర్గంలో జరుగుతున్నాయనే సంతోషాన్ని చాలా సందర్భాలలో వ్యక్తపర్చేవారు.

అదే విధంగా మా జిల్లాకు కొత్తగా కలెక్టర్ గారు వచ్చిన సందర్భంలో అభినందనలు తెలియజేస్తూ అక్కడే మేమందరం ఉన్నప్పుడు మంత్రిగారూ మా నియోజకవర్గానికి ఎప్పుడు వస్తున్నారు? తొందరగా రావాలి, మీరు మార్కెట్ యార్డును మంజూరు చేశారు కాబట్టి దాని ప్రారంభోత్సవానికి రావాలని నన్ను ఆహ్వానించగా తొందరలోనే ప్రారంభోత్సవానికి వెళదామని అనుకున్నాను. కానీ అంతలోనే వారు మరణించడం చాలా దురదృష్టకరం. కిష్టారెడ్డి గారి మృతికి నా ప్రగాఢమైన సానుభూతిని తెలియజేస్తూ, వారి కుటుంబానికి నా ప్రగాఢమైన సానుభూతిని తెలియజేస్తూ వారి ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తూ సెలవు తీసుకుంటున్నాను.

మిస్టర్ స్పీకర్: మెదక్ జిల్లా నారాయణ్‌ఖేడ్ శాసనసభ్యులు, ప్రజా పద్దుల కమిటీ అధ్యక్షులు శ్రీ పి. కిష్టారెడ్డి గారి ఆకస్మిక మృతికి ఈ సభ తీవ్ర సంతాపాన్ని వ్యక్తం చేస్తూ శోకార్థులైన వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నది. శ్రీ కిష్టారెడ్డి గారు మెదక్ జిల్లా పంచగామ గ్రామంలో 02-10-1942 గుండేటి, సంగమ్మ దంపతులకు జన్మించారు. వీరికి భార్య, నలుగురు కుమారులు ఉన్నారు. వీరు ఉస్మానియా విశ్వ విద్యాలయం నుంచి న్యాయ శాస్త్రంలో పట్టా పొందిన తరువాత సంగారెడ్డి జిల్లా కోర్టులో ప్రభుత్వ ప్లీడరుగా పనిచేశారు. 1970 నుంచి 1980 వరకు పంచగామ గ్రామ సర్పంచిగా, 1981 నుంచి 1986 వరకు నారాయణ్‌ఖేడ్ సమితీ అధ్యక్షుడిగా పనిచేశారు. కిష్టారెడ్డి గారు 1989లో తొలిసారిగా నారాయణ్‌ఖేడ్ శాసనసభ్యుడిగా ఎన్నికయ్యారు. 1999, 2009, 2014 సంవత్సరాలలో తిరిగి శాసనసభ్యుడిగా ఎన్నికయ్యారు. కిష్టారెడ్డి గారు తిరుమల తిరుపతి దేవస్థానం సభ్యుడిగా కూడా పనిచేశారు. ఆంధ్రప్రదేశ్ ఉమ్మడి రాష్ట్రంలో ప్రజా పద్దుల కమిటీ ఛైర్మన్‌గా, నీటి పారుదల స్థాయీ సంఘం అధ్యక్షుడిగా కూడా పనిచేశారు. వీరు ప్రజా పద్దుల కమిటీ అధ్యక్షులుగా తొమ్మిది నివేదికలను శాసనసభకు సమర్పించారు. కిష్టారెడ్డి గారు ప్యానెల్ స్పీకర్‌గా కూడా వ్యవహరించారు. 2014-15 సంవత్సరాలకు సంబంధించి పంచాయతీరాజ్ శాఖ, గ్రామీణాభివృద్ధి శాఖలపై చర్చలు జరిపారు. N.R.E.G.S పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానం చేస్తూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన తీర్మానాన్ని బలపర్చారు. రాజకీయాలలో సౌమ్యుడు. కిష్టారెడ్డి గారు అవినీతి, అక్రమాలకు తావు లేకుండా ఎలాంటి పదవులను అప్పగించినా చాలా సమర్థవంతంగా బాధ్యతలు

నిర్వహించి అందరి మన్ననలను పొందారు. తెలంగాణ మొదటి శాసనసభ ప్రజాపద్దుల కమిటీ అధ్యక్షుడిగా కొనసాగుతూ 25, ఆగస్టు, 2015 రోజున ఆకస్మికంగా మరణించారు. వీరి ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తూ రెండు నిమిషాలు మౌనం పాటిద్దాం.

(సభ రెండు నిమిషాలు మౌనం పాటించింది)

The House is adjourned to meet again at 10.00 A.M on 29th September,2015.

(The House then adjourned at 11.58 A.M to meet again at 10.00 A.M on Tuesday, the 29th September, 2015.)

* * *

“Published under Rule 310 of the Rules of Procedure and Conduct of
Business in the Telangana Legislative Council and Printed
at the Assembly Press, Public Gardens, Hyderabad.”